J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 17.01.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 33 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## వడివడిగా అడుగులు...
# వచ్చే నెలలోనే విశాఖకు..



➤ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలలో ప్రకటించే అవకాశం ➤ పాలనలో వేగం పెంచేందుకు సత్వర నిర్ణయం

**లేడికి లేచిందే పరుగు... ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలన కూడా ఇలాగే వుంది. ఆయన ఏదనుకుంటే అది జరిగిపోవాలి. పరిపాలనలో వేగం జగన్ తత్వం. ఏదీ వాయిదా వేయకూడదు... ఏదీ ఆలస్యం చేయకూడదు.**

పరిపాలనలో గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరు తాబేలును తలపిస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రం చిరుతను తలపిస్తున్నాడు. ఏదైనా ఆలస్యం చేస్తే ఫలితాలు ఎలా వుంటాయ నేందుకు అమరావతియే ఉదాహరణ. చంద్రబాబు నాన్చుడు ధోరణఇ వల్ల ఈరోజు 29 గ్రామాల రైతులు రోడ్లెక్కి నెత్తినోరు బాదుకుంటున్నారు. ఐదేళ్ల సమయమున్నా కూడా ఆయన అమరావతిని ఒక స్థిరమైన రాజధానిగా రూపొందించలేకపోయాడు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఆ తప్పు చేయదలచుకోలేదు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు మూడు రాజధానులను ప్రకటించాడు. ఈ క్రమంలో

(మిగతా 11వ పేజీలో)

• 'అమ్మఒడి'
## పల్లెల్లో పండుగ సందడి



చిన్నారుల చదువులకు బాసటగా, పేద మధ్యతరగతి తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత నిస్తూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'అమ్మఒడి' పథకం

(మిగతా 11వ పేజీలో)



• తెలుగుకు వెలుగు
## వెంకయ్య కృషి ఫలితం



ఎన్నాళ్ళ నుంచో ఎదురుచూస్తున్న ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం నెల్లూరుసీమలో ప్రారంభం కాబోతోంది.

(మిగతా 11వ పేజీలో)

• 'స్థానిక' సమరంపై
## 'సుప్రీం' స్టే!




రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. స్థానిక సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం 59శాతానికిపైగా రిజర్వేషన్లు కేటాయించడాన్ని నిరసిస్తూ కొందరు అగ్రవర్ణాల వారు వేసిన పిటిషన్‌ను

(మిగతా 11వ పేజీలో)





# అభివృద్ధి పథంలో.. గూడూరు

## మునిసిపాలిటీకి గ్రేడ్-1 గుర్తింపు

జిల్లాలో గూడూరుకు ప్రత్యేకస్థానం ఉంది. డివిజన్ కేంద్రంగా, పురపాలకసంఘంగా, నియోజకవర్గ కేంద్రంగా, నిమ్మ పంటకు, మైకా గనులకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా, రైల్వే జంక్షన్ కూడా ఉన్న గూడూరు గ్రేడ్-3 పురపాలక సంఘంగా గుర్తింపు పొందింది. పంచాయతీ స్థాయి నుంచి పురపాలక సంఘం స్థాయి వరకు పెరిగిన గూడూరులో అభివృద్ధి కూడా క్రమేణా పెరుగుతూ వచ్చింది. దాదాపు 70వేల జనాభా పట్టణంలో నివాసం ఉండడంతో పాటు, పలు వ్యాపారాలకు, ఆసుపత్రులకు, ఇతరత్రా పనులకు వచ్చేపోయే ప్రజలు నిత్యం సుమారు మరో 50 వేల మంది దాకా రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణ విస్తీర్ణం సుమారు 10 కిలోమీటర్ల దాకా విస్తరించింది. ప్రస్తుతం 33 వార్డులుగా ఉన్న పురపాలకసంఘం పంచాయతీల విలీన ప్రక్రియ పూర్తయితే 47 వార్డులుగా రూపాంతరం చెందనుంది. గూడూరు పారిశ్రామికంగా మైకా, సిరామిక్ గ్లాస్ ఫ్యాక్టరీ, నిమ్మ తదితర వాణిజ్యపంటలకు కేంద్రంగా పేరొందింది. ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశంలోని చెన్నై, బెంగుళూరు, కేరళ తదితర ప్రాంతాలకు, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకువెళ్ళే భక్తులు అధికసంఖ్యలో గూడూరు రైల్వే స్టేషన్ కేంద్రంగా రాకపోకలు సాగిస్తున్నారు. గూడూరు పురపాలక సంఘంలో ఇంతవరకు ఛైర్మన్‌లుగా ఉన్న 11 మంది వివిధ సామాజిక వర్గాలకు చెందిన పలు పార్టీల నాయకులు ఇక్కడ పాలన సాగించారు. అలాంటి పురపాలక సంఘం తాజాగా గ్రేడ్-1 పురపాలక సంఘంగా రూపాంతరం చెందడం అభివృద్ధి చెందుతున్న గూడూరుకు మంచి గుర్తింపుగా చెప్పుకోవచ్చు.

### బాబు వేషాలను...

# జనం నమ్మరు

**మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి**

వైఎస్సార్సీపిని అప్రదిష్ట పాలుచేసేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేస్తున్న వేషాలను జనం నమ్మరని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 11న వింజమూరులోని బిసి కాలనీలో సిమెంటురోడ్డు నిర్మాణపు పనులకు భూమిపూజ చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తున్నారన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అమలుచేసేందుకు ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అకాలవర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు కూడా నష్టపరిహారం అందించి ఆదుకున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని ఆయన చెప్పారు. అమ్మఒడి పథకం ద్వారా లబ్దిపొందుతున్న తల్లులు ఎంతో సంతోషంతో ఉన్నారని ఆయన అంటూ, ఉదయగిరి నియోజకవర్గంలో సుమారు 20 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు త్వరలోనే ప్రారంభం కాబోతున్నాయన్నారు. అధికారులు ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు పల్లాల కొండారెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, ఎం.చిన్నికృష్ణారెడ్డి, మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పోరెడ్డి జగన్, గోపిరెడ్డి రమణారెడ్డి, దాట్ల కృష్ణారెడ్డి, దాట్ల విజయకుమార్‌రెడ్డి జుపల్లి రాజు, గణపం చెన్నారెడ్డి, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

నెల్లూరు జిల్లాలో మొట్టమొదటిసారిగా తిరుపతి సిమ్స్ ఆసుపత్రి వైద్య బృందం, మెటర్నిటీ బృందం మహిళలకు మొబైల్ పింక్‌బస్సుతో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇలాంటి పరీక్షలు నెల్లూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చేయడం ఇదే ప్రథమమని తిరుపతి నిమ్స్ ఎమర్జెన్సీ మెడిసన్(ఈఎం) చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మునుస్వామి తెలిపారు. సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ ఆలోచన దృక్పథం, మాజీమంత్రి పరసా రత్నం అభ్యర్థన మేరకు ఈనెల11న గొట్టిప్రోలులో వైద్యసేవలు అందించామన్నారు. పింక్ బస్సులో సుమారు రూ.3.5కోట్ల విలువైన కేన్సర్ నిర్ధారణ పరికరాలు ఉన్నాయన్నారు. మహిళలకు రొమ్ము కేన్సర్ గుర్తించే మెమోగ్రామ్, గర్భసంచిలో వచ్చే వివిధ రకాల కేన్సర్‌లను గుర్తించేందుకు పాప్ సర్వైకల్ పరీక్షలతోపాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించవచ్చున్నారు. 200 మంది మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు, వివిధ వ్యాధులకు సంబంధించి 140 మందికి పరీక్షలు నిర్వహించారు. సిమ్స్ నుంచి 40 మంది, తిరుపతి మెటర్నిటీ నుంచి 8 మంది డాక్టర్లు, గూడూరు నుంచి డాక్టర్ సరస్వతి, 16మంది టెక్నీషియన్స్, డివిజన్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ రమాదేవి, దంతవైద్యులు కిషోర్,అనిల్, పరసా కస్తూరమ్మ, మాజీ సర్పంచ్ పల్లమాల రామిరెడ్డి, వేలూరు మురళీరెడ్డి, పేరం రమేష్ నాయుడు, వేమసాని శ్రీనివాసులు నాయుడు, కేశవులు పాల్గొన్నారు.

# అతి అయినా అనర్థదాయకమే!

***అతివృష్టి... అనావృష్టి... మనిషికి రెండూ అనర్థమే! పొద్దున్నే నాలుగు ఇడ్లీలు తినే కెపాసిటీ వుందనుకుందాం... ఒక ఇడ్లీనే తింటే ఆకలి తీరదు, 10 ఇడ్లీలు తింటే అరిగి చావక ఆసుపత్రికి పరుగులు తీయాల్సి వస్తుంది. కాబట్టి దేనికైనా మోతాదుకు తగినట్లుగానే వుండాలి.***



జిల్లాలో వర్షాల పరిస్థితి కూడా అతివృష్టి, అనావృష్టిలాగానే మారింది. చంద్రబాబు సీఎంగా వున్న ఐదేళ్లు వర్షాలను కురవమన్నా కురవలేదు, సాగునీళ్లకు, తాగునీళ్లకు అల్లాడాల్సి వచ్చింది. జగన్ సీఎం అయ్యాక వర్షాలు ఆగమన్నా ఆగడం లేదు. ఇది మరీ అతివృష్టి అయ్యింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షాలు పడడం సర్వసాధారణం. గత ఏడాది ఆ రెండు నెలల్లో జిల్లాలో బాగానే వర్షాలు పడ్డాయి. అంతేగాక శ్రీశైలం నుండి కూడా సోమశిలకు పూర్తి స్థాయిలో నీళ్లు చేరాయి. జిల్లాలో దాదాపు 10లక్షల ఎకరాలలో వరిపంట సాగవుతోంది. ఇంతవరకు బాగానే వుంది.

మెట్ట ప్రాంతాలలో ఈసారి మినుము, పొగాకు, కంది, జొన్న వంటి పైర్లను వేల ఎకరాలలో వేసున్నారు. ఆత్మకూరు, ఉదయగిరి, వింజమూరు, మర్రిపాడు, పొదలకూరు, దుత్తలూరు, సీతారాంపురం, ఏఎస్‌పేట తదితర మండలాలలో వాణిజ్య పంటలెక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తుంటారు. గత రెండు నెలల్లో కురిసిన వర్షాల వల్ల ఈసారి మెట్ట పైర్లను పెద్ద విస్తీర్ణంలోనే సాగు చేస్తున్నారు.

అయితే ఈ జనవరి నెలలో కూడా వర్షాలు పడుతుండడంతో మెట్ట రైతులు ఆందోళనలో వున్నారు. ఈ నెలలో వర్షాలు పడితే, మినుము పంట పూర్తిగా దెబ్బతింటుంది. ఇప్పటికే రైతులు మినుముపై బాగా పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు అకాల వర్షాలు పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశాలున్నాయి.

సింహపురి సమాచారం

## మెప్మా నూతన సమాఖ్య

గూడూరు పట్టణంలోని మెప్మా పట్టణ సమాఖ్య సభ్యులను మెప్మా కార్యాలయంలో ఈనెల 11 న ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కాంతయ్య తెలిపారు. అధ్యక్షురాలిగా సులోచన, కార్యదర్శిగా యమున, కోశాధికారిగా సుజాత, ఉపాధ్యక్షురాలుగా సుమతి, సంయుక్త కార్యదర్శిగా సుబ్బరత్నమ్మను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులకు మెప్మా అధికారులు, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు. పొదుపు సభ్యులకు సకాలంలో రుణాలు అందించి ఆర్థికాభివృద్ధి సాధించేలా సహకారం అందించాలని సూచించారు. సమాఖ్య రిసోర్స్‌పర్సన్‌గా నవ్యకను ఎంపిక చేసినట్లు తెలిపారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లు హైమావతి, చందన, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

### పురపాలక సంఘానిదే

## పన్ను వసూలు బాధ్యత



కమిషనర్ ఓబులేసు

గూడూరు పురపాలక సంఘంలో చెన్నూరు, నెల్లటూరు, పోటుపాలెం, దివిపాలెం, చిల్లకూరు విలీనం జరగడంతో పనుల నిర్వహణ, పన్నుల వసూళ్ళు ఇతర లావాదేవీలను పురపాలక సంఘ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు తెలిపారు. ప్రభుత్వ జీవో విడుదల చేసిన తేదీ నుండీ విలీన గ్రామాలు పురపాలక సంఘం పరిధిలోకి వచ్చాయని తెలిపారు.

### బోడిగాడితోటలోని ప్రజలకు..

# అన్ని సదుపాయాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ బి.వి.రమణకుమార్

నెల్లూరు బోడిగాడితోటలో ఉంటున్న ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ బీవీ రమణకుమార్ పేర్కొన్నారు. ఈనెల 10న ఆయన జిల్లా అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడుతూ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డీటీ) తరపున పడారుపల్లిలో రూ.10కోట్లతో 254 పక్కా ఇళ్ళ నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇక్కడ ఉండే వారికి ఆధార్, రేషన్ కార్డు లేనివారికి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సమక్షంలో ముఖాముఖి మాట్లాడించి సమస్యలు పరిష్కరించేలా చూశారు. జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.మనోహర్‌రావు, నగర డీఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి, క్యాప్ ప్రాజెక్ట్ అడ్వయిజర్ డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సిరామిక్ యూత్ ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పొణకా దేవసేన, కోడూరు కల్పలత, రాజ్యలక్ష్మి తదితరులు

గూడూరు రెండో పట్టణ పరిధిలో ఈ నెల 12వ తేదీ తిలక్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఐటిఐ కళాశాల వద్ద వైకాపా నాయకులు కోడూరు మీరారెడ్డి మరియు సిరామిక్ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీఛైర్‌పర్సన్‌లు పొణకా దేవసేనమ్మ, కోడూరు కల్పలత తదితరులు హాజరయ్యారు. మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులను వారు పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి, సుభాన్, చంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు, చవటపాలెం దిశ ఘటనలో దోషులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల గూడూరులోని మసీదు దగ్గర నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ చేస్తూ రాస్తారోకో చేసిన ముస్లింలు

# సీఎంను కలిసిన సతీష్‌రెడ్డి



భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డిఆర్‌డిఓ) ఛైర్మెన్, నెల్లూరీయుడు గుండ్రా సతీష్‌రెడ్డి ఈ నెల 11వ తేదీ తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా నాగాయలంకలో ఏర్పాటు చేయనున్న క్షిపణి పరిశోధన కేంద్రంపై వారిరువురూ చర్చించారు. అనంతరం సతీష్‌రెడ్డితో కలిసి సీఎం జగన్ భోజనం చేశారు. ఆ తర్వాత సతీష్‌రెడ్డిని సీఎం జగన్ శాలువాతో సత్కరించారు.

## వెంకయ్య సంక్రాంతి

ప్రపంచంలో ఏ మూలన వున్నా, ఎంతటి ఉన్నత పదవిలో వున్నా సంక్రాంతి పండుగ నాడు ఇంట్లో ఉండి సంప్రదాయబద్ధంగా ఆ పండుగను జరుపుకోవడం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆచరిస్తున్న ఆనవాయితీ. ఈ సంక్రాంతి పండుగను కూడా ఆయన చెన్నైలోని తన నివాసంలో ఎంతో ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయం ప్రకారం భోగి మంటలు వేసి పిండి వంటలతో ఈ పండుగను ఆస్వాదించారు. తన సతీమణి ఉషమ్మ, కొడుకు హర్షవర్ధన్, కూతురు దీప, కోడలు రాధ, అల్లుడు వెంకట్‌లతో పాటు మనుమడు, మనుమరాళ్ళు ఇతర కుటుంబసభ్యులతో ఆయన పండుగను సంతోషంగా జరుపుకున్నారు.





ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా విడుదలైన 60వేల రూపాయల చెక్కును రాపూరు మండలం జోరేపల్లి గ్రామస్తుడు ఎం.బాలకృష్ణయ్యకు అందజేస్తున్న వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి

### సొంత ఊరి అభివృద్ధికి...

# ఊతమిస్తున్న.. విజయసాయిరెడ్డి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో కీలక బాధ్యతలు మోస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి పార్టీ అధికారంలోకి వచ్చాక తొలిసారి ఈ సంక్రాంతి పండక్కి తన స్వగ్రామమైన ముత్తుకూరు మండలంలోని తాళ్లపూడికి విచ్చేశాడు. 15, 16తేదీలలో జిల్లాలో పలుచోట్ల పర్యటించాడు. 15వ తేదీ నెల్లూరు ఇస్కాన్‌సిటీలోని మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఇంటికి వచ్చాడు. అనిల్ ఇంట ఆతిథ్యాన్ని స్వీకరించాడు. 16వ తేదీ తన స్వగ్రామమైన తాళ్లపూడిలో దాదాపు 13కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశాడు. ఈ సందర్భంగా తాళ్ళపూడి గ్రామాన్ని ఆదర్శగ్రామంగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పాడు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ వుంటుందని పేర్కొన్నాడు. అనంతరం సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నాడు.

ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటుసభ్యులు బల్లి దుర్గాప్రసాద్, మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసిపి నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



తాళ్ళపూడిలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు, మంత్రి అనిల్, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఎంపి విజయసాయిరెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

### వాత్సల్యలో..

## విద్యార్థులకు సంక్రాంతి దుస్తులు



నెల్లూరు కొండాయపాలెంరోడ్డులోని వాత్సల్య అనాథాశ్రమంలో విద్యార్థులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన నూతన వస్త్రాలను అందజేస్తున్న ఆశ్రమం గౌరవాధ్యక్షులు సామంతు గోపాలరెడ్డి, పక్కన జి.వి.సాంబశివరావు, దుర్గాప్రసాద్, జి.ఆంజనేయులు

# పండక్కి పిండేశారు

- అధిక ఛార్జీలతో కుమ్మేశారు
- టిక్కెట్లు దొరక్క ప్రయాణీకుల అవస్థలు
- స్పెషల్ పేరుతో ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ

ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకుని ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ఆమాంతం 200 శాతం నుంచి 300 శాతం వరకు చార్జీలను పెంచేశారు. దీంతో జిల్లా నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పండుగల సందర్భంగా చార్జీలను కట్టడి చేయాలని సంబంధిత రవాణాశాఖ మంత్రి రవాణా అధికారులను ఆదేశించినా ఫలితం శూన్యమనే విమర్శలు వినిపిస్తున్నాయి. నెల్లూరు నుంచి కావేరి, ఆరెంజ్, శ్రీకృష్ణ, కేఎంబీటీ, మార్నింగ్‌స్టార్, తులశి, రాజేశ్వరి, వినాయక తదితర ట్రావెల్స్ బస్సులు సుమారు 70కి పైగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. వీటితో పాటు వివిధ ప్రాంతాల నుంచి నెల్లూరు మీదుగా మరో 50బస్సుల్లో ప్రయాణీకులను చేరవేస్తుంటారు. ఈ క్రమంలో జిల్లా నుంచి ఉద్యోగ, వ్యాపార, బతుకుదెరువు కోసం అనేక మంది ప్రజలు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై తదితర ప్రాంతాలకు వలస వెళ్ళారు. ప్రధాన పండగైన సంక్రాంతికి సొంతూళ్ళకు రావడం పరిపాటి. ఈ నేపథ్యంలో వాళ్ళ అవసరాన్ని ప్రైవేట్ యాజమాన్యాలు క్యాష్ చేసుకోవాలని ప్రజల డిమాండ్‌ను దృష్టిలో వుంచుకుని టికెట్ ధరలను ఆమాంతం పెంచేశాయి. ఏసీ, స్లీపర్ పేరుతో సాధారణ టిక్కెట్ పై అదనంగా 200, 300 శాతం మేర చార్జీలను పెంచేశారు. ప్రైవేట్ ట్రావెల్స్‌లో చార్జీలను కట్టడి చేయాలన్న రవాణాశాఖ మంత్రి ఆదేశాలను రవాణా అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపుచ్చుకుంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.



## ఏఎంసి ఛైర్మెన్‌గా ఏసునాయుడు



నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటి కొత్త పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఈ నెల 13వ తేదీ నెల్లూరు మద్రాసుబస్టాండ్ సెంటర్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో జరిగింది. కమిటీకి ఛైర్మెన్‌గా ఎంబేటి ఏసునాయుడు, వైస్‌ఛైర్మెన్‌గా ఆరుగంటి శారద, డైరెక్టర్‌లుగా నాపా సుబ్బారావు, మనుబోలు శ్రీధర్‌రెడ్డి, జి.విజయలక్ష్మి, కుండా మురళీకుమార్‌రెడ్డి, చింతా ప్రశాంతి, మన్నెం చిట్టిబాబు, ముత్యాల సంధ్య, రావూరు చంద్రశేఖర్, పొణకా ప్రతిమ, మంచికంటి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, ఉప్పు నబిత, ఉప్పు ప్రసన్న, వీర రాఘవరెడ్డిలు ప్రమాణస్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైసిపి నాయకులు తాటి వెంకటేశ్వర్లు, ఎం.సుధీర్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రభా'తం

## అమెరికా యుద్ధ క్రీడ

ప్రపంచం ప్రశాంతంగా వుంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు లేవు. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్‌లు కాల్పుల విరమణ ప్రకటించారు. సిరియాలో ఐఎస్ తుడిచిపెట్టుకుపోయింది. ఆల్‌ఖైదా అంతరించింది. ఈమధ్య ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ కూడా కిమ్మనడం లేదు. ఇరాక్, ఇరాన్‌ల మధ్య అంతర్యుద్ధం లేదు. ఇజ్రాయిల్, పాలస్తీనాల గొడవలు కూడా తగ్గుముఖం పట్టాయి. ప్రపంచం ఇంత ప్రశాంతంగా వుంటే ఎట్లా? మన అగ్రరాజ్య ఉనికిని కాపాడుకునేదెట్లా? ఏదో ఒకటి చేస్తుంటే, ఎవరో ఒకడి నెత్తిన బాంబులేస్తుంటేనే కదా ప్రపంచ దేశాలు మన నెంబర్ వన్ స్థానాన్ని గుర్తించేది. మనమంటే భయపడేది. సరిగ్గా అదే ఆలోచనతోనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్ సైనిక జనరల్ ఖాసిం సులేమానిని డ్రోన్ దాడి ద్వారా హతమార్చాడు. ప్రశాంతంగా వున్న సరస్సులో పెద్ద బండరాయి వేశాడు. సులేమాని హత్యతో స్పందించిన ఇరాన్ ఇరాక్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అమెరికాతో యుద్ధానికి సైతం సిద్ధమైంది.



> అమెరికాలో అధ్యక్షుడు ట్రంప్‌పై అభిశంసన తీర్మానం సిద్ధమవుతోంది. ఇది నెగ్గితే ట్రంప్ పదవీచ్యుతుడవుతాడు. అమెరికా చరిత్రలో పనికిమాలిన అధ్యక్షుడవుతాడు. ఇప్పటికిప్పడు ఆ ముప్పను ఎదుర్కోవాలంటే ప్రజల దృష్టిని యుద్ధం వైపుకు మరల్చడం... ఇరాన్ మీద నాలుగు బాంబులు వేసి, అమెరికా అగ్రరాజ్యం అన్న భావాన్ని తన దేశ ప్రజలలో కలుగజేయడం... ఇంతకుముందు అధ్యక్షులుగా పనిచేసిన వాళ్లలో ఎక్కువ మంది తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఎంచుకున్న మార్గాలివే! ఇప్పడు ట్రంప్ కూడా అదే దోవ పట్టాడు.

అసలు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సులేమానిని హతమార్చాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇరాన్‌ను రెచ్చగొట్టాల్సిన అవసరం ఏముందన్నది పెద్ద ప్రశ్న? పశ్చిమాసియా సంపన్న దేశాలలో ఇరాన్ ఒకటి. ఆయిల్ నిల్వలు సమృద్ధిగా వున్న దేశం. ఇంధన ప్రపంచంలో సౌదీఅరేబియాకు, ఇరాన్‌కు మధ్యే పోటీ వుంది. ఇరాన్, ఇరాక్‌ల మధ్య దాదాపు పదేళ్లు యుద్ధం నడిచింది. ఇరాక్‌కైనా కువైట్‌ను ఆక్రమించుకుని తనంతట తాను నాశనమైపోయిన చరిత్ర ఉందిగాని, ఇరాన్‌కు ఎప్పుడు కూడా ఇంకో దేశాన్ని కవ్వించిన చరిత్రగాని, ఆక్రమించుకున్న చరిత్ర గాని లేదు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలతో దానికి వ్యాపార సంబంధాలున్నాయి. ముఖ్యంగా భారత్‌తో దృఢమైన బంధముంది. ఇటీవల ఇరాన్ నుండి ఇంధనం కొనుగోలు చేయొద్దని అమెరికా విధించిన ఆంక్షలను సైతం ధిక్కరిస్తూ భారత ప్రభుత్వం ఆ దేశంతో ఇంధన కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది.

ఇరాన్ తీవ్రవాద దేశం కూడా కాదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదు కూడా! ఒక్క మాటలో చెప్పాలంటే ఆల్‌ఖైదా, ఐఎస్ వంటి ఉగ్ర సంస్థల నిర్మూలనలో ఇరాన్ పాత్ర ఎంతో వుంది. అమెరికా డ్రోన్‌దాడిలో మరణించిన సులేమాని ప్రధానపాత్ర పోషించారు కూడా!

ప్రస్తుతానికి ప్రపంచానికి ఇరాన్ నుండి ఎలాంటి ప్రమాదం లేకున్నా అణుప్రమాదం లేకున్నా అణు నిరాయుధీకరణ పేరుతో అమెరికా ఆ దేశాన్ని రెచ్చగొట్టడం వెనుక అనేక కారణాలు కనిపిస్తున్నాయి.

పశ్చిమాసియా దేశాలలో సౌదీ అరేబియా, ఒమన్ వంటి దేశాలు అమెరికాకు సన్నిహితంగా వున్నాయి. అణు నిరాయుధీకరణ విషయంలో అమెరికాకు ఇరాన్‌కు మధ్య పొసగడం లేదు. ఇంధన పంపిణీ దేశాల జాబితాలో సౌదీని ఇరాన్ కంటే మొదటి స్థానంలో నిలపాలన్నది ట్రంప్ ఆలోచన. అలా చేయాలంటే ముందు ఇరాన్‌ను దెబ్బకొట్టాలి. ఆ దేశాన్ని ఇరాక్ మాదిరిగా చేసిపెట్టాలి. అంతర్జాతీయ సమాజం నుండి ఆ దేశంపై ఆంక్షలు విధించాలి. ఏ దేశం కూడా ఆ దేశం నుండి ఇంధనం కొనకుండా చూడాలి! అలా చేస్తే ఇరాన్ ఆర్థికాభివృద్ధి పడిపోతుంది. తీవ్ర దుస్థితికి లోనవుతుంది. తమపై దయతలచి ఆంక్షలు సడలించమని అమెరికాను వేడుకుంటుంది. చివరకు తమ చెప్పుచేతల్లోకి వస్తుంది... ఇదీ ఒక ఆలోచన.

ఇక రెండో కోణంలో చూస్తే అమెరికాలో అధ్యక్షుడు ట్రంప్‌పై అభిశంసన తీర్మానం సిద్ధమవుతోంది. ఇది నెగ్గితే ట్రంప్ పదవీచ్యుతుడవుతాడు. అమెరికా చరిత్రలో పనికిమాలిన అధ్యక్షుడవుతాడు. ఇప్పటికిప్పుడు ఆ ముప్పును ఎదుర్కోవాలంటే ప్రజల దృష్టిని యుద్ధం వైపుకు మరల్చడం... ఇరాన్ మీద నాలుగు బాంబులు వేసి, అమెరికా అగ్రరాజ్యం అన్న భావాన్ని తన దేశ ప్రజలలో కలుగజేయడం... ఇంతకుముందు అధ్యక్షులుగా పనిచేసిన వాళ్ళలో ఎక్కువ మంది తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఎంచుకున్న మార్గాలివే! ఇప్పుడు ట్రంప్ కూడా అదే దోవ పట్టాడు.

అమెరికా ఆధిపత్య దాష్టికానికి ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, లిబియా, సిరియా వంటి దేశాలన్నీ ఇప్పటికీ అగ్నిగుండాల్లా మండుతున్నాయి. వీటి జాబితాలో ఇరాన్‌ను కూడా చేర్చడానికి అగ్రరాజ్యం సిద్ధపడుతున్నట్లుంది. ఆవు.. ఆవు పోట్లాడుకుని లేగదూడ కాళ్లు విరగొట్టినట్లు సంపన్న దేశాల మధ్య యుద్ధాలు తలెత్తినప్పుడల్లా పేద దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియా దేశాలలో యుద్ధ వాతావరణం తలెత్తితే ముడిచమురు సంక్షోభం ఏర్పడుతోంది. అమెరికాలో కొన్నేళ్లకు సరిపడా చమురు నిల్వలు వుంటాయి కాబట్టి ఆ దేశానికి ఎటువంటి ఇబ్బంది లేదు. కాని, చమురు దిగుమతుల మీదే ప్రధానంగా ఆధారపడి వున్న భారతదేశం, ఇతర దేశాల మీద దీని ప్రభావం వుంటుంది. ముఖ్యంగా ఇరాన్‌తోనే మనకు చమురు ఒప్పందాలున్నాయి. ఇరాన్‌పై అమెరికా దాడులకు తెగిస్తే భారత్‌పై పెనుభారం పడే అవకాశముంది.

## వాసవీమాత ఆలయ పునర్నిర్మాణం.. ఆర్యవైశ్యులకు వరం

**- మాజీ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్**



శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు ఆర్యవైశ్యులకు ఆరాధ్యదైవమని, నగర ఆర్య వైశ్యులకు అమ్మవారు ఇచ్చిన వరం..ఆలయ పునర్నిర్మాణమని, 122 ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ఆర్యవైశ్యులంతా సహకరించాలని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి గౌరవాధ్యక్షుడు, మాజీ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ కోరారు. ఈనెల 9న ఆయన నెల్లూరులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరులో అమ్మవారి ఆలయం పునర్నిర్మాణం భక్తులకు మహద్భాగ్యమన్నారు. ఇందుకు లక్షకు పైగానే విరాళం ఇచ్చిన దాతలు ఉన్నారని, అమ్మవారికి బంగారు మకరతోరణం చేయిస్తున్నామని, దాతలు ఒక గ్రాము బంగారం తక్కువ కాకుండా సమర్పించుకోవాలన్నారు. దాతల సహకారంతో నూతన ఆలయం పున:ప్రారంభానికి సిద్ధమవుతోందని, ఫిబ్రవరి 1 నుంచి 5వతేది వరకు ఆలయంలో కుంభాభిషేకం నిర్వహిస్తామని, కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరవిజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో దేవతామూర్తుల ప్రతిష్ఠ, విమాన గోపుర కలశాల మహాకుంభాభిషేకం ఎంతో ఘనంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆలయం కుంభాభిషేక ఉత్సవాల కరపత్రాలను వారు విడుదల చేశారు. ఆలయం అధ్యక్షుడు దాసా సురేష్‌కుమార్, కార్యదర్శి అయితా రామ చంద్రరావు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సుంకు మనోహర్, సహాయ కార్యదర్శి దొంతంశెట్టి వివేకానందం, సభ్యులు శ్రీరామ్ సురేష్; కోట సూర్యనారాయణ, సరాబు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## విద్యార్థులు సేవాదృక్పథంతో ఉండాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, శ్రీకృష్ణచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల11న కుడితిపాళెం గ్రామంలో మొక్కలు నాటారు. కళాశాల డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, డీన్ శ్రీమతి సుధారాణి, డిఎఫ్ఓ వంశీకృష్ణ, ఏడిఎఫ్ఓ నారాయణతో పాటు సుమారు నూరుమంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రెడ్‌క్రాస్ వాలంటీర్లు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## చెంగాళమ్మ హుండీ ఆదాయం 28.94 లక్షలు

సూళ్ళూరుపేట శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయం హుండీల ద్వారా 28.94 లక్షల రూపాయల రాబడి వచ్చింది. ఈనెల 9న హుండీలను లెక్కించగా మొత్తం 28,94,226 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్‌బాబు, ఆలయ ధర్మకర్తలమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## దొంగ ఏడుపులు ఆపండి!

సిఏఏ, ఎన్ఆర్‌సి చట్టాలపై కాంగ్రెస్, వామపక్షాలు దొంగ ఏడుపులేడుస్తున్నాయి. దేశం పట్ల వీళ్ళకు ఇసుమంత బాధ్యత కూడా లేదు. ఎన్ఆర్‌సి చట్టాన్ని అమలు చేయకపోతే భవిష్యత్‌లో ఈ దేశం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సివస్తుంది. దేశం నిండా అక్రమవలసదారులు పోగవుతారు. ఈ దేశ పౌరులతో పాటు సమంగా హక్కులు పొందుతారు. మన మీద ఆధిపత్యం కోసం తెగిస్తారు. ముఖ్యంగా మతపరమైన మౌఢ్యంతో పరిమితులు లేకుండా జనాభాను పెంచుకుంటూపోతారు. ఎన్ఆర్‌సిని అమలుచేసి అక్రమ వలసదారులను బయటకు పంపకపోతే భవిష్యత్‌లో ఈ దేశం భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది.

**– సి.రాజీవి, నెల్లూరు.**

## జెఎన్‌యును మూసేయాలి

ఢిల్లీలోని జెఎన్ యూనివర్శిటీ వివాదాలకు కేంద్రమవుతోంది. వామపక్ష తీవ్రవాద శక్తులకు ఇదొక అడ్డాగా, దేశ ద్రోహులకు వేదికగా ఉపయోగపడుతోంది. ఈ దేశ ప్రజలు కట్టే పన్నులతో ఇక్కడ జీతాలు తీసుకుంటూ, హాస్టళ్లలో వసతులు అనుభవిస్తున్న వాళ్ళు జాతీయ వ్యతిరేక విధానాలను అనుసరిస్తుండడం శోచనీయం. పనికిమాలిన గ్యాంగ్‌లు ఇక్కడ తిష్ట వేశాయి. జాతి విచ్ఛిన్నకర శక్తులకు ఈ విశ్వవిద్యాలయం ఒక స్వర్గధామంలా మారింది. ఇక్కడ విద్యార్థులు చదువులకు కాకుండా విచ్చలవిడితనానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ యూనివర్శిటీని మూసేయడం మేలు.

**సి.నాగరాజు, కావలి.**

## సుప్రీం జోక్యం చేసుకోవాలి

ఓట్ల కోసం రాజకీయ పార్టీలు సంక్షేమ పథకాల గారడీ చేస్తుంటాయి. నోటికి నరమే లేదన్నట్లు... వరాలిస్తుంటాయి. అధికారంలోకి వచ్చాక ఆ సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వాలు నానా తంటాలు పడుతుంటాయి. ఇప్పుడు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్నది ఇదే! ముఖ్యమంత్రి వైయస్‌జగన్మోహన్‌రెడ్డి అవసరం లేని సంక్షేమ పథకాలకు కూడా నిధులు తగలేస్తున్నాడు. ప్రజలకు విద్య, వైద్యం వంటివి ఉచితంగా అందిస్తే చాలు. మిగిలిన సంక్షేమ పథకాలతో పనిలేదు. ప్రజలకు నేరుగా డబ్బులిచ్చే ఏ పథకం కూడా కరెక్ట్ కాదు. ప్రభుత్వాలు విచ్చలవిడిగా ఇలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయకుండా సుప్రీం కోర్టు కళ్లెం వేయాలి.

**పావర్తి సులోచన, వెంకటగిరి.**

# ఎంపిక ఛాన్స్ ఏ ఎమ్మెల్యేకో..?

## జడ్పీ సీటు ఎవరి కోటాలోకి...?



*జిల్లా పరిషత్ ఛైర్మెన్... ఒక రేంజ్ వున్న పదవి. ఓరుగంటి వెంకటసుబ్బయ్య, నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేనకూరు గోపాలకృష్ణారెడ్డి, దేగా నరసింహారెడ్డి వంటి ఉద్ధండులు ఏలిన పదవి. జిల్లా ప్రజలందరితో సంబంధాలున్న హోదా. ఇంత వరకు ఈ కుర్చీలో అగ్రవర్ణాల వారితో పాటు బలహీనవర్గాలు, దళిత వర్గాల నాయకులు, నాయకురాళ్ళు కూడా కూర్చుని వున్నారు. చరిత్రలో తొట్టతొలిసారిగా గిరిజన బిడ్డలను ఈ కుర్చీపై కూర్చోబెట్టే అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని ఎవరు అందిపుచ్చుకోబోతున్నారన్నదే ఇప్పుడు ప్రశ్నగా మారింది.*

జిల్లాలో పదిమంది ఎమ్మెల్యేలున్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యేగా వున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఆ ఛాన్స్ లేదు. ఆయన నియోజకవర్గానికి జడ్పీతో సంబంధమే వుండదు. నెల్లూరురూరల్ నియోజకవర్గంలో ఒకే ఒక జడ్పీటీసీ వుంది, అది కూడా జనరల్ అయ్యింది. కాబట్టి ఆ ఎమ్మెల్యేకు దీంతో పనిలేదు. జిల్లాలో 46 జడ్పీటీసీలకుగాను 5జడ్పీటీసీలే ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. అందులో మూడు మహిళలకు కేటాయించారు. ఎస్టీ జనరల్ సీట్లలో మహిళలు పోటీ చేసే దానికి అవకాశముందిగాని, మహిళల రిజర్వుడ్ సీట్లలో పురుషులు పోటీ చేసే అవకాశం లేదు. కాబట్టి ఎస్టీ జనరల్‌లో జడ్పీ ఛైర్మెన్ పదవి వున్నా, దీనిని ఎస్టీ మహిళనే వరించే అవకాశాలు ఎక్కువుగా వున్నాయి.

ఈసారి జడ్పీ ఛైర్మెన్‌ను ఎంపిక చేసే అవకాశం నలుగురు ఎమ్మెల్యేల చేతుల్లో వుంది. ఎస్టీలకు రిజర్వయిన జడ్పీటీసీలలో నాయుడుపేట, డివి సత్రం మండలాలు సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో వున్నాయి. రెండు రిజర్వ్‌డ్ ఎస్టీ స్థానాలున్న నియోజకవర్గమిదే కావడంతో జడ్పీ ఛైర్మెన్ ఎంపికలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాత్ర కీలకం కావచ్చు. కోవూరు నియోజకవర్గ పరిధిలో ఇందుకూరుపేట ఎస్టీ రిజర్వేషన్‌లో వుంది. దీంతో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కూడా జడ్పీ ఛైర్మెన్‌గా తన అనుచరులను పెట్టుకునే ప్రయత్నం చేయొచ్చు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో సంగం మండలం ఎస్టీ రిజర్వ్ అయ్యింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి దీనిపై పెద్దగా ప్రయత్నించకపోవచ్చు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో డక్కిలి ఎస్టీలో వుంది. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ప్రస్తుతమున్న పరిస్థితుల్లో దీని కోసం ప్రయత్నాలు చేయకపోవచ్చు.

### వైస్ కోసం పోటీ!

ఛైర్మెన్ పదవి ఎస్టీలకు రిజర్వ్ కావడంతో వైస్ ఛైర్మెన్ కోసం పలువురు గట్టిగా పోటీపడే అవకాశముంది. సాధారణంగా జడ్పీ ఛైర్మెన్ పదవి జనరల్ అయినప్పుడు వైస్ ఛైర్మెన్ పదవిని బిసిలకు ఇస్తూ వచ్చారు. రిజర్వ్ అయినప్పుడు వైస్‌ఛైర్మెన్ పదవిని అగ్రవర్ణాలకు ఇస్తూ వచ్చారు. ఇప్పుడు ఛైర్మెన్ ఎస్టీ.. ఆ పదవిలో ఎవరున్నా డమ్మీగానే వుంటారని, వైస్‌ఛైర్మెన్ అయితే ఛైర్మెన్ లెవల్లో అధికారం వెలగబెట్టొచ్చనే వూహల్లో చాలామంది నాయకులున్నారు. కాబట్టి ఈసారి జడ్పీ వైస్‌ఛైర్మెన్ పదవికి గట్టిగా పోటీ పడేటట్లున్నారు.

# మున్సిపల్ యోగం లేనట్లేనా?

**• ఈసారికి పంచాయితీల లెక్కే**

పంచాయితీల ఎన్నికలకు తేదీలు ఖరారు కావడం తెలిసిందే! ఈ ప్రభుత్వంలోనైనా జిల్లాలో వున్న పలు పెద్ద పట్టణాలు నగర పంచాయితీలు లేదా మున్సిపాల్టీలుగా మారుతాయని భావించారు. అయితే వీరి ప్రతిపాదన ఇంకా పెండింగ్‌లోనే వుంది. ప్రభుత్వం నుండి ఇంకా గెజిట్ నోట్ విడుదల కాకపోవడంతో ఈలోపు పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే అన్ని పంచాయితీలతో పాటు నగర పంచాయితీలుగా ప్రతిపాదిస్తున్న మేజర్ పంచాయితీలకు కూడా ఎన్నికలు జరిపే అవకాశాలు లేకపోలేదు.

జిల్లాలో బుచ్చిరెడ్డిపాలెం, కోట, వాకాడు, విద్యానగర్, అల్లూరు, కోవూరు, వింజమూరులను నగర పంచాయితీలుగా మార్చాలనే ప్రతిపాదనలు వున్నాయి. జిల్లా కలెక్టరేట్ నుండి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా వెళ్లాయి. అయితే అదింకా ఆమోదం పొందలేదు. ఫిబ్రవరిలో పంచాయితీ ఎన్నికలు నిర్వహించాల్సివుంది. నగర పంచాయితీలుగా ప్రతిపాదించిన మేజర్ పంచాయితీలకు కూడా రిజర్వేషన్‌లు ప్రకటించేసివున్నారు. పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్‌లోపు ప్రభుత్వం నుండి ఆమోదం రాకపోతే వీటికి పంచాయితీ ఎన్నికలే! ఒకవేళ ఆలోపు నగర పంచాయితీలుగా ఆమోదిస్తే మున్సిపాల్టీలతో పాటు వీటికీ ఎన్నికలుంటాయి.

## ఎన్నికల నిర్వహణకు సామాగ్రి సిద్ధం




నెల్లూరు జిల్లాలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల్లూరు నగరంలోని నూతన జడ్పీ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రిని కట్టలు కట్టి పోలింగ్ అధికారులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. జడ్పీ సీఇఓ సుశీల మాట్లాడుతూ ఈనెల 17న ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం వుందని, ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. 46 జడ్పీటీసీలు, 583 ఎంపీటీసీలకు రెండు దశల్లో ఎన్నికలను నిర్వహించనున్నారన్నారు.





స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారు

జననం: 08-11-1930 మరణం: 18-01-1995

వ్యవస్థాపకులు

లాయర్
తెలుగు వారపత్రిక

మహనీయుని మహితాత్మకు మా నివాళి.

లాయర్ సిబ్బంది కుటుంబసభ్యులు

## వేణుగోపాలస్వామి ఆలయంలో..
# భోగి కల్యాణం

భోగి పండుగను పురస్కరించుకుని నెల్లూరు మూలాపేటలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణు గోపాలస్వామి ఆలయంలో ఈనెల 14వ తేది రాత్రి భోగి కల్యాణమహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ లక్ష్మీనాధ్‌రెడ్డి, ఇ.ఓ వేగూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. లక్ష్మీనారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా ఈ వేడుక నిర్వహించారు.

## ఎన్‌సిడి ఉద్యోగాలకు
# దరఖాస్తులు పంపండి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌సిడి ప్రోగ్రామ్ విజయవాడ వారి ఉత్తర్వుల మేరకు, జిల్లా కలెక్టర్ సూచనలను అనుసరించి ఎన్‌సిడి విభాగంలో మిగిలి పోయిన వివిధ రకాల ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, వివరాలకు నెల్లూరు సంతపేటలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని ఏడిఎం హెచ్‌ఓ, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణాధికారి డాక్టర్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ లోపు తగు రుసుము చెల్లించి దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు.

## రచయితల సంఘం
# ముగ్గులపోటీలు

నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని శిశు మందిరంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు మహిళలు ఎంతో ఆకర్షణీయంగా రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. సంఘం అధ్యక్షులు ఏ.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ ముగ్గుల పోటీలను పర్యవేక్షించారు.

## ఏసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్
# అధ్యక్షుడిగా శేషగిరిరావు

నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బాసం శేషగిరిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రతి రెండు సంవత్సరాలకు జరిగే ఎన్నికలు ఈనెల 13 న నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. మాజీ అధ్యక్షుడు తిరుపతి నాయుడు, వెంకయ్య, అంకిరెడ్డి, రాఘవేంద్రషెట్టి, శ్రీనివాసకుమార్, రంగారావు, వెంకటేశ్వర్లు గౌడ్, నరశింహారెడ్డి పాల్గొన్నారు.

## రెండు వారాల పాటు
# 'నిర్వాణ'కు విరామం

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో రుచికరమైన భోజనం చేయాలంటే గుర్తొచ్చేది హోటల్ నిర్వాణ. మురళీకృష్ణ హోటల్స్‌వారి అనుబంధ హోటల్ అయిన నిర్వాణ గత కొన్నేళ్ళుగా ఆహార ప్రియులకు నిరంతరాయ సేవలు అందించింది. కాగా, హోటల్ మరమ్మత్తుల నేపథ్యంలో దాదాపు 15రోజులు మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆధునిక హంగులు సంతరించుకుని రెండు వారాల తర్వాత మళ్ళీ ఇది ఆహార ప్రియులకు తన సేవలందించనుంది.

# వాలంటీర్లకు కొత్త ఫోన్లు

గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేసే వాలంటీర్లకు ప్రభుత్వం కొత్త సెల్‌ఫోన్లను పంపింది. అవి జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరాయి. జడ్పీ సిఇఓ సుశీల ఈనెల14న వాటిని విడుదల చేశారు. మండల ఎంపిడిఓల ద్వారా అవి వాలంటీర్లకు పంపిణీ చేయనున్నారు.

## ఫిబ్రవరి 3 నుండి నెల్లూరులో
# శంకర విజయేంద్ర సరస్వతి



కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఫిబ్రవరి 3వ తేదీ నుండి 18వ తేదీ వరకు నెల్లూరు, మూలాపేటలోని శంకర మఠంలో విడిది చేయనున్నారు. స్వామివారు రెండువారాల పాటు నెల్లూరుజిల్లాలో జరిగే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనబోతున్నారు. జొన్నవాడలోని శ్రీ మల్లిఖార్జునస్వామి సమేత కామాక్షి తాయి దేవస్థానంలో జరిగే మహాకుంభాభిషేకంలో పాల్గొంటారు. నూతనంగా ప్రారంభించిన ప్రాకార మండపాలను ప్రారంభిస్తారు. నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలో పునర్నిర్మించిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అలాగే టిపి గూడూరు మండలం సౌత్‌ఆములూరులో పున ర్నిర్మించిన సౌత్‌ఆములూరమ్మ గ్రామ శక్తి ఆలయం ప్రారంభోత్సవంలోనూ ఆయన పాల్గొననున్నారు.

# భగ్గుమన్న 'భోగి' తాటాకు

సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ఈసారి కూడా షరా మామూలుగానే మార్కెట్‌లో ధరలు ఆకాశానికంటాయి. వీటితో పాటు తానేమీ తక్కువ తినలేదంటూ ఎండిపోయిన తాటాకుల ధర కూడా అటకెక్కి కూర్చుంది. సంప్రదాయబద్ధంగా భోగిరోజున భోగిమంట వేసుకునేందుకు జనం తాటాకులు కొనుగోలు చేస్తుంటారు. గత ఏడాది నాలుగు తాటాకుల ధర 30 రూపాయల దాకా ఉంటే ఈసారి అది 50 రూపాయలకు పెరిగింది. ఇళ్ళకాడకి తాటాకు మోపులు కట్టి తీసుకొచ్చేవారు నాలుగు తాటాకులను కట్టగా కట్టి 50 రూపాయలు ధర చెప్పడంతో భోగి తాటాకుల ధర భగ్గుమన్నట్లయ్యింది. మూడు కట్టలు కొంటే వంద రూపాయలేనంటూ కొంత రాయితీ ఇచ్చారు కానీ, అంత ధర పెట్టి కొనలేని వారు ఇంట్లో ఉన్న పాత కాగితాలు, పాత సామాగ్రితో భోగిమంట వేసుకుని సరిపెట్టుకున్నారు.

## 'ఇన్‌స్పైర్ మనక్'లో
# రాష్ట్రస్థాయికి జాహ్నవి




ఇన్‌స్పైర్ మనక్ – 2020 కార్యక్రమం కింద నెల్లూరులోని సెయింట్ జోసఫ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇటీవల జిల్లామొత్తమ్మీద అన్ని పాఠశాలల తరఫున 564 ప్రాజెక్టులు రాగా, వాటిలో 55 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. వీటిలో డా.కిషోర్స్ రత్నం ఎలిట్ ఒలింపియాడ్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని సి.జాహ్నవి రూపొందించిన కిచెన్ వేస్ట్ వాటర్ రీయూజ్ ఎగ్జిబిట్ అందరినీ బాగా ఆకట్టుకుంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా కిచెన్ వేస్ట్ వాటర్‌ని వ్యర్థం చేయకుండా తిరిగి ఉపయోగించవచ్చని నిరూపించడంతో ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్లు డా.కె.కృష్ణకిషోర్; వాసంతి కిషోర్‌లతో పాటు పాఠశాల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ పి.ఎన్ రేవతి, మేనేజర్ ఇ.అశోక్, గైడ్ టీచర్ కె.శ్రీవాణి అందరూ జాహ్నవిని అభినందించారు.

## నెల్లూరు కబుర్లు

# అతిరథుల ఆగమనం



ఈ నెల 21న వెంకటాచలం వద్ద జరిగే ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం ప్రారంభోత్సవానికి ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడుతో పాటు ఏపి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, పలువురు కేంద్రమంత్రులు పాల్గొననున్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌రావులకు కూడా ఆహ్వానం పంపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా తెలుగు భాషకు సంబంధించిన ఈ గొప్ప కార్యక్రమంలో వాళ్ళు పాల్గొనాల్సినప్పటికీ, తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా కేసీఆర్, ఏపిలో రాజధాని అంశం, స్థానిక ఎన్నికల నిర్వహణపై కోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో జగన్మోహన్‌రెడ్డిలు ఈ కార్యక్రమానికి రావడం అనుమానమేనని తెలుస్తోంది.

## బాక్సైట్ కోసమే
# రాజధాని మార్పు



విలేకర్లతో మాట్లాడుతున్న కోటంరెడ్డి శీనయ్య

విశాఖపట్నంలో వున్న బాక్సైట్, అల్యూమినియం గనులను దోచుకునేందుకే రాజధాని మార్పు అని నుడా మాజీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. ఈనెల 13న నెల్లూరు ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమరావతిని అంధకారంలోకి నెట్టేశారన్నారు. 34 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల రక్తంతో రాజధాని తడిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని వైకాపా నాయకులు, పోలీసులు గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం పదవికి జగన్ కళంకం తెస్తే మంత్రులు కూడా అదే దారిలో వెళుతున్నారని విమర్శించారు. ద్వారంపూడి చంద్రశేఖర్ ఇష్టమెచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. చంద్రబాబును తిడితే మంత్రి పదవి వస్తుందని కొందరు ప్రయత్నం చేస్తున్నారన్నారు. అమరావతి మహిళా రైతుల ఆవేదన, కన్నీటి వల్లే జగన్ మళ్ళీ కోర్టు మెట్లు ఎక్కుతున్నారని పేర్కొన్నారు. మంత్రి కొడాలి నాని మాటలు సరికాదన్నారు. టీడీపీ నాయకులు హరిబాబుయాదవ్, జెన్ని రమణయ్య, మేకల రామ్మూర్తి, ఖాజావలి, మొయినుద్దీన్, ఎ.శ్రీనివాసులు నాయుడు, హనుమంతు, మల్లిఖార్జున్, శశి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# మూలస్థానేశ్వరస్వామి ఆలయం మూత

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానాన్ని ఈ నెల 17వ తేదీ నుండి 26వ తేదీ వరకు మూసివేయనున్నారు. 27వ తేదీ నుండి ఆలయంలో కుంభాభిషేకాలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిసింది. కుంభాభిషేకాలతో పాటు దేవస్థానంలో పునర్నిర్మించిన భువనేశ్వరి అమ్మవారి గర్భగుడిని కూడా పునః ప్రారంభించనున్నారు. కుంభాభిషేకాల సందర్భంగా ఆలయంలో దాదాపు 50మంది వేద పండితులచే ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించనున్నారు. కుంభాభిషేకానికి సంబంధించిన ఏర్పాట్లను ఇప్పుడే మొదలుపెట్టారు.

## 20న రెడ్‌క్రాస్ సొసైటీకి
# ఎన్నికల నోటిఫికేషన్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ ను ఈనెల 20 న కలెక్టర్, ఎన్నికల అధికారి యంవి శేషగిరిబాబు విడుదల చేయనున్నారని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ డాక్టర్ సుబ్బారావు తెలిపారు. 15 మంది పాలకవర్గ సభ్యులను ఎన్నుకునేందుకు షెడ్యూల్ ను ప్రకటించనున్నారన్నారు. 25న నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణ, ఫిబ్రవరి 2న పోలింగ్‌ను నిర్వహించనున్నారని, అదేరోజు ఓట్ల లెక్కింపు జరగనుందన్నారు.

## నెల్లూరులో తొలిసారిగా..
# ఎస్‌బిఐ వెల్త్ హబ్ ప్రారంభం

దేశవ్యాప్తంగా 46 మేజర్ నగరాల్లో వెల్త్ హబ్‌లు ప్రారంభించాలనే లక్ష్యంలో భాగంగా, రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులో ఎస్‌బిఐ వెల్త్‌హబ్ ప్రారంభించారు. దేశంలో ఇది 124వ వెల్త్‌హబ్ అని, నెల్లూరులోని రైల్వేఫీడర్స్‌రోడ్డులో ఉన్న నెల్లూరు టౌన్ ఎస్‌బిఐ బ్రాంచ్‌లో ఈనెల 10న వెల్త్ హబ్‌ను ప్రారంభించిన భారతీయ స్టేట్‌బ్యాంక్ డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఎస్‌బిఐ కొత్తశాఖను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బిఐ వెల్త్‌హబ్ ద్వారా ఒక రిలేషన్‌షిప్ ప్రతినిధి ఖాతాదారుల ఇంటికి వచ్చి వ్యక్తిగత బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక ప్రణాళికల పోర్ట్‌ఫోలియో పెట్టుబడులకు సలహాలు, సూచనలు అందిస్తారని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. దేశంలో అతిపెద్ద బ్యాంక్ భారతీయ స్టేట్‌బ్యాంక్ అని, పలు పథకాల ద్వారా ఖాతాదారులకు సేవలందిస్తోందని వివరించారు. ఎస్‌బిఐ జనరల్ మేనేజర్లు మునికంఠన్‌నాయర్, మినాల్ భట్టాచార్య, డిప్యూటి జనరల్ మేనేజర్ వినయ్ కులకర్ణి, రీజినల్ మేనేజర్‌లు రవిచంద్రన్, ప్రసాద్, నెల్లూరు టౌన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నాగేశ్వరరావు, ఫత్తేఖాన్‌పేట ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ షేక్ సందాని బాషా, ఏజిఎం వెల్త్ ఏవియస్‌యస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పొట్టేపాళెం కోదండరాముని సేవకు
# కొత్త ధర్మకర్తలు

### ఛైర్మెన్‌గా పొన్నాల రామచంద్రారెడ్డి



నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఈనెల 14న కొత్త ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం చేసింది. ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా పొన్నాల రామచంద్రారెడ్డి, సభ్యులుగా సండి మల్లికార్జునయ్య, ఉప్పాల పార్వతి, ఇండ్ల మునెమ్మ, కొప్పాల సునీతతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యునిగా ఆలయ ప్రధాన అర్చకుడు కుల శేఖరాచార్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఆలయం అభివృద్ధికి, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామని ధర్మకర్తల మండలి ఈ సందర్భంగా పేర్కొంది. ఆలయ ఇ.ఓ పెంచల వరప్రసాద్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కృష్ణచైతన్య, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్సీపి నాయకులు బండి శ్రీనివాసులురెడ్డి, అల్లారెడ్డి ప్రసాద్‌రెడ్డి, వెంకటశేషారెడ్డి తదితరులు ఈ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్నారు.



కోవూరు వాస్తవ్యుడు, అనపల్లి కన్వెన్షన్ సెంటర్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త అనపల్లి అశోక్ రెడ్డి, ఆయన కుమారుడు కమలేష్‌లు భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని కలిశారు. జనవరి 12వ తేదీ చెన్నైలోని వెంకయ్య నివాసంలో వీరు కలిశారు. అశోక్‌రెడ్డితో తనకున్న చిరకాల బంధాన్ని ఈ సందర్భంగా వెంకయ్య గుర్తు చేసుకున్నారు.

# కోటి రూపాయలతో కాపుభవన్, హాస్టల్

**మంత్రి అనిల్**



బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి డా. అనిల్

కాపుభవన్, కాపు హాస్టల్‌కు కోటి రూపాయలను ప్రభుత్వం నుంచి, కాపు కార్పొరేషన్ నుంచి విడుదల చేయించి ఆ నిర్మాణాలను సత్వరమే పూర్తిచేయిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.పి. అనిల్‌కుమార్ చెప్పారు. బలిజ కులస్తులకు ఏ సమస్య వచ్చినా నిర్భయంతరంగా తనను సంప్రదించవచ్చని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈనెల 16న నెల్లూరులోని భవాని రెసిడెన్సీలో జిల్లా బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి డా. అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సేవాసమితి అధ్యక్షులు అనిల్‌కుమార్, కార్యదర్శి చక్రధర్, కోశాధికారి నాగేశ్వరరావు తదితరులు ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డా. శశిధర్, ఇఇలు కృష్ణప్రసాద్, రాఘవేంద్రం, జిల్లా కార్యవర్గ సభ్యులు శేషయ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మల్లికార్జున రావు, అశోక్‌కుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శులకు పదోన్నతి

నెల్లూరు జిల్లా పంచాయితీ పరిధిలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 పంచాయితీ కార్యదర్శులకు గ్రేడ్-2 కార్యదర్శులుగా ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరుగాక మరో 12 మందిని కూడా ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు కేటాయించారు. డీపీవో ధనలక్ష్మి వారికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పదోన్నతి పత్రాలను అందజేశారు. జిల్లా గ్రామ కార్యదర్శుల సంఘ ప్రధాన నేతలు శ్రీధర్, దొరబాబు, డీపీవో కార్యాలయ ఇన్‌చార్జి ఏవో విజయకృష్ణ పాల్గొన్నారు.

# జిల్లాలో వెల్లివిరిసిన సంక్రాంతి శోభ

**మూడురోజుల పండుగలతో సర్వత్రా సందడే**

సంక్రాంతి పండుగల శోభతో నెల్లూరు సీమ కళకళలాడింది. ఆనందోత్సాహాలతో జిల్లా ప్రజలు సంక్రాంతి పర్వదినాన్ని జరుపుకున్నారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు కావడంతో ఈ మూడు రోజులు ప్రతి ఇంటా సందడే కనిపించింది. పిల్లాపాపలతో ప్రజలంతా పండుగను సంతోషంగా జరుపుకున్నారు.



సంక్రాంతి పర్వదినం సందర్భంగా అటు గ్రామాల్లోనూ, ఇటు పట్టణాల్లోనూ పండుగ కళ వెల్లివిరిసింది. ప్రతి ఇంటా పిల్లాపాపలతో కుటుంబసభ్యులంతా కలసి ఆనందంగా పండుగలు జరుపుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కొన్ని చోట్ల గ్రామోత్సవాలను కూడా వైభవంగా నిర్వహించారు. మరోవైపు ప్రభుత్వం ఆధ్వర్యంలోనూ ఈ పండుగలు నిర్వహించడంతో అధికారులు, ప్రజలతో కలసి సంబరాలు చేసుకోవడం విశేషం. ఇళ్ళ ముందు రంగురంగుల రంగవల్లులతో వీధులు కళకళలాడాయి. గొబ్బెమ్మ పూజలు విశేషంగా జరిగాయి. చిన్నారులు గాలిపటాలు ఎగరేస్తూ ఆనందించారు. ఊళ్ళన్నీ ఆటపాటలతో కోలాహలంగా పండుగలు జరుపుకున్నారు. బంధువులు, స్నేహితులతో కలసి ప్రజలు ఆనందంగా భోగి మంటలు వేసుకుని, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతిని వేడుకగా చేసుకున్నారు. జిల్లాలోనూ, నెల్లూరు నగరంలోనూ ఆయా ప్రాంతాల్లోని నాయకులు, ప్రజలు కలిసి ఆటల పోటీలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కులమతాలకు అతీతంగా, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సవాలతో సంక్రాంతి వేడుకల్లో పాలుపంచుకుని ఆనందించారు. ఈ మూడురోజులూ నగరంలోని అన్ని దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా వస్త్రదుకాణాల్లో జనానికి సందులేదు. కూరగాయల మార్కెట్‌లు రాత్రీపగలూ రద్దీగానే ఉన్నాయి. పండుగ సెలవుల్లో ప్రజలు కుటుంబాలతో సహా ఆలయాలకు వెళ్ళడం, నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి వెళ్ళి పక్షులను తిలకించడం, ఆటపాటల పోటీల్లో పాల్గొనడం వంటి కార్యక్రమాలతో ఈ మూడు రోజులు సంతోషంగా గడిపారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ భోగి, సంక్రాంతి సంబరాలు



నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు నిర్వహణలో ఈనెల 14,15 తేదీలలో భోగి, సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా బలరామయ్య నాయుడు భోగి పండుగ, సంక్రాంతి పండుగల విశిష్టతలను గురించి వాకర్స్ సభ్యులకు వివరించారు. గంగిరెద్దులను ఆహ్వానించి వాటి విన్యాసాలను తిలకించి జంగం దేవర ఆశీర్వచనాలు తీసుకున్నారు. వాకర్స్ సభ్యులందరికి సంక్రాంతి పిండివంటలు పంపిణీ చేశారు. రెండు రోజులు వాకర్స్ సభ్యులందరు ఆనందోత్సాహాలతో గడిపారు. వినుకొండ వెంకటేశ్వర్లు, కొండూరు సుబ్బారావు, మనోహర్ రెడ్డి, వీరిశెట్టి హజరత్ బాబు, సోను, జీవీ కృష్ణయ్య, మాగంటి ప్రసాద్, బి. చెంచయ్య, శివయ్య, మారుతీరావు, పిచ్చయ్య, లక్ష్మీ నారాయణ, శ్రీనాథ్ రెడ్డి, రాఘవేంద్ర షెట్టి తదితరులు పాల్గొన్నారు.

## 'రివర్స్'లో మిగిలింది

సర్వేపల్లి కాలువ అభివృద్ధి పనులకు జరిగిన రివర్స్ టెండరింగ్ లో 4.59 శాతం తగ్గింపుతో ఓ సంస్థ పనులు దక్కించుకుంది. పనుల అంచనాల విలువ రూ.99 కోట్లకుగాను రూ.85 కోట్లకు జరిగిన టెండర్ ప్రక్రియలో రూ.83.70 కోట్లకు పనులు దక్కించుకున్నారు. ఈనెల 13 న ఉదయం నుండి సాయంత్రం వరకు నలుగురు కాంట్రాక్టర్ల మధ్య జరిగిన రివర్స్ టెండరింగ్ ప్రక్రియలో మొదటి నుంచి 4.59 లెస్‌తో మొదలై చివరికి అదే మొత్తంలో పూర్తయింది. దీంతో రూ.4.30 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం సమకూరినట్లు ఇరిగేషన్ ఎస్‌ఈ ప్రసాదరావు తెలిపారు. ములుమూడి పొగరువాగు కాజ్ వేకు రూ.29.9 లక్షలతో నిర్మాణ పనులకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర నీటిపారుదల శాఖ జీవో నెంబర్ ఆర్టీ30ని విడుదల చేసింది.

# భోగి మంటల్లో నివేదికలు



రాజధాని తరలింపును నిరసిస్తూ తెలుగుదేశం నాయకులు ఈ నెల 13న నెల్లూరులో వినూత్న రీతిలో భోగిమంటలు వేశారు. సోమవారం రాత్రి నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద భోగిమంటలు వేసి రాజధానిపై జివిఎన్ రావు, బోస్టన్ కన్సల్టెన్సీ కమిటి, హైపవర్ కమిటీ ఇచ్చిన నివేదికలను ఆ మంటల్లో వేసి దహనం చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 33వేల ఎకరాల భూములను స్వచ్ఛందంగా ఇచ్చిన అమరావతి రైతుల త్యాగాలను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎగతాళి చేసేలా నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమన్నారు. రాజధాని తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మాజీమేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, సిహెచ్ హరిబాబుయాదవ్, బి.మనోహర్‌రెడ్డి, ఖాజావలి, పాల్‌శెట్టి, కె.తిరుమలనాయుడు, అమృల్లా తదితరులు పాల్గొన్నారు.





# శ్రీసిటీలో ట్రైనీ ఐఏఎస్‌లు

వివిధ రాష్ట్రాలకు చెందిన 20 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు తమ స్టడీ టూర్‌లో భాగంగా ఈనెల 10వ తేదీన శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రస్థానం, ఎదుర్కొన్న సవాళ్ళు, శ్రీసిటీ ప్రత్యేకతలను ఆయన వారికి వివరించారు. పారిశ్రామిక వృద్ధి, వ్యాపారానుకూల పర్యావరణం, సామాజిక బాధ్యత, స్థానికుల సహకారం వగైరాలన్నీ కలసి శ్రీసిటీని నేడు దేశంలోని ఉత్తమ ప్రపంచస్థాయి స్మార్ట్ వ్యాపార గమ్యస్థానాల్లో ఒకటిగా నిలపడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆయన ట్రైనీ ఐఏఎస్‌లే కాకుండా దేశవిదేశాలకు చెందిన అధికారులు, సాంకేతికనిపుణులు తదితరులు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తమకు గర్వకారణమన్నారు. వారం రోజుల వ్యవధిలోనే వివిధ రాష్ట్రాలకు చెందిన రెండవ బ్యాచ్ అధికారులు శ్రీసిటీలో పర్యటించడం విశేషమన్నారు. అనంతరం ట్రైనీ ఐఏఎస్ అధికారులు శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు.

## చెంగంబాక్కంలో ఉచిత వైద్యశిబిరం



శ్రీసిటీలోని యూని ఛార్మ్ పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా చెన్నై సిమ్స్ ఆసుపత్రి, శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని చెంగంబాక్కం గ్రామంలోని ప్రభుత్వ స్కూల్ ఆవరణలో ఈనెల 11న ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 122 మందికి బీపీ, షుగర్, ఇతర సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి రోగులకు సలహాలు సూచనలతో పాటు అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## అమరావతి పోరుపై..

# నిరంకుశత్వం తగదు!

**- బీద బాధ**



మూడు రాజధానులకు మద్దతుగా వైసిపి వాళ్లు చేస్తున్న ర్యాలీలకు అనుమతినిస్తున్న పోలీసులు, మూడు రాజధానులకు వ్యతిరేకంగా తాము చేస్తున్న నిరసనలను మాత్రం ఎందుకు అనుమతించడం లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ప్రశ్నించాడు. ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం అన్యాయమన్నాడు. ప్రజల ప్రశ్నించే హక్కును కాలరాయడమేనన్నాడు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని కోరుతూ విజయవాడ కనకదుర్గమ్మ వద్దకు కాలినడకన సారెను తీసుకెళ్తున్న మహిళలపై పోలీసులు దౌర్జన్యం చేయడం బ్రిటీష్ కాలాన్ని తలపిస్తోందని, పోలీసు దాడుల్లో చాలామంది మహిళల కాళ్లు విరిగాయని ఆయన పేర్కొన్నాడు. అమరావతి రాజధాని కోసం జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాన్ని ప్రభుత్వం నిరంకుశంగా అణచివేయాలని చూస్తోందని, ప్రజా ఉద్యమాల ముందు ఎంతటి నియంతలైనా తలవంచాల్సిందేనని, ఇది చరిత్ర చెప్పే సత్యమన్నాడు.

ఈ సమావేశంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమేయర్ అబ్దుల్ అజీజ్, నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ గంజాయి ముఠా అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్

అంతర్జాతీయ గంజాయి స్మగ్లింగ్ ముఠాలోని సభ్యులను నెల్లూరు టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.15 లక్షలు విలువచేసే వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 11న నెల్లూరు ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎస్పీ భాస్కర్ భూషణ్ నిందితుల వివరాలను విలేకరులకు తెలిపారు. అందిన సమాచారం మేరకు సీసీయస్, హైవే పోలీస్ స్టేషన్ల అధికారులు అక్రమ రవాణాపై ప్రత్యేకనిఘా ఉంచారు. భారీ మొత్తంలో గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు తడ చెక్ పోస్టులో, కావలి రూరల్ పరిధిలో వాహనాలను తనిఖీ చేశారు. తడ చెక్ పోస్ట్ వద్ద కారులో 180 కిలోలు, కావలి రూరల్ పరిధిలో 250 కిలోలు వెరసి 430 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు, తెలంగాణా రాష్ట్రంలోని భద్రాది కొత్తగూడెంకు చెందిన నేరస్థులు కొంతకాలంగా దేశ సరిహద్దుల నుంచి గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. భద్రాది నుంచి తమిళనాడు తిరుచ్చి మీదుగా శ్రీలంకకు గంజాయిని ఈ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా సభ్యులు తీసుకెళుతున్నారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా భద్రాచలం, ఏవోబీ స్థావరాలుగా గంజాయిని సేకరించి అక్రమంగా శ్రీలంకకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులను అరెస్ట్ చేయడం కోసం ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కేసులో ప్రతిభ చాటిన సీసీయస్ సీఐ శ్రీనివాసన్, సూళ్ళూరుపేట సీఐ వెంకటేశ్వరరెడ్డి, కావలి రూరల్ సర్కిల్ సీఐ సుబ్బారావు, తడ ఎస్సై వేణు, సూళ్ళూరుపేట ఎస్సై శ్రీనివాస్, కావలి టూటౌన్‌కు చెందిన వీరంద్రకు ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

# మూడు రాజధానులపై.. ప్రజల ఆనందం



## - ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులను ప్రకటించడంతో ప్రజలెంతో సంతోషిస్తున్నారని, కానీ అమరావతి చుట్టూ భూములు కొనుక్కున్న చంద్రబాబునాయుడుకు, ఆయన బినామీలకు మాత్రం భయం పుడుతోందని, దీంతో ఏమీ చేయాలో తెలియక బయటిప్రాంతాల నుంచి రౌడీలను రప్పించి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాడంటూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈనెల 11న బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన 12 పంచాయతీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల సమీక్షలో ప్రసన్న మాట్లాడుతూ చంద్రబాబు వెకిలిచేష్టలు చూసి సిఎం జగన్‌తోపాటు ఎమ్మెల్యేలందరం నవ్వుకుంటున్నామన్నారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్న వైయస్ జగన్మోహన్‌రెడ్డిని చూసి ఓర్వలేక చంద్రబాబు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, బాబు గారడీమాటలు ఎవరూ నమ్మరని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, షేక్ అల్లాబక్షు, టి. మల్లికార్జున్‌రెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, నందకుమార్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రిని గుర్తుచేసుకున్న ఉద్యోగులు



ఈ నెల 11వ తేదీన భారత రెండవ ప్రధాని, జై జవాన్, జై కిసాన్ నినాద సృష్టికర్త లాల్‌బహుదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా గూడూరులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎబి ఛారిటబుల్ ట్రస్ట్, ఎం.వి.రావు ఫౌండేషన్ మరియు శంకర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ లక్ష్మణరావు, ఎస్‌కె అన్వర్ బాషా, ఎం.లీలాకృష్ణమోహన్, షేక్ రఫి, షేక్ మున్నా, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# 29న శ్రీ జగన్నాథ రథయాత్ర





రథయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డా. సుకదేవస్వామి

వసంత పంచమి రోజున ప్రతి ఏడాది లాగే ఈనెల 29వ తేది బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నెల్లూరు ట్రంకు రోడ్డు ఏసీ సెంటర్ నుండి 9వ శ్రీ జగన్నాథ రథయాత్ర అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో బయలుదేరుతుందని ఇస్కాన్ అధ్యక్షులు డాక్టర్ సుకదేవస్వామి తెలిపారు. ఈనెల11న నెల్లూరు కొండాయపాళెం రోడ్డులోని ఇస్కాన్ మందిరంలోని సమావేశ మందిరంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ రథయాత్రలో జపాన్ నుంచి ఇస్కాన్ అంతర్జాతీయ అధ్యక్షులు బాలుస్వామి, దేశ విదేశాల నుంచి, వైష్ణవ భక్తులు, ప్రముఖులు పాల్గొంటున్నారని తెలిపారు. సద్భావన, ఆత్మ జ్ఞానాన్ని పొందడం, సుఖశాంతులతో ఉండడమే ఈ రథయాత్ర ఉద్దేశ్యమన్నారు. ఈ రథయాత్రలో భగవన్నామ సంకీర్తన చేసేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులను ఆహ్వానిస్తున్నామన్నారు.

రాజశేఖర్ స్వామి మాట్లాడుతూ ఈ రథయాత్ర నెల్లూరు ఏసీ సెంటర్ నుండి బయలుదేరి ట్రంకురోడ్డు మీదుగా గాంధీబొమ్మ సెంటర్, వీఆర్సీ, ఆర్టీసీ, కెవిఆర్ పెట్రోలు బంకు మీదుగా మాగుంట లేఅవుట్, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుండి వీపీఆర్ కల్యాణ మండపానికి రాత్రి 7 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. రథయాత్రలో భక్తులందరికి ప్రసాద ప్యాకెట్లు అందజేస్తామన్నారు. మనకు ఎంతో దూరంలో వుండే ఒరిస్సా రాష్ట్రం పూరీ క్షేత్రంలో జరిగే ప్రపంచంలోనే అతిపెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే శ్రీ జగన్నాథ రథయాత్ర మన నెల్లూరులో తొమ్మిదవసారి ఈనెల 29న జరగనుందని తెలిపారు. ఇప్పటి వరకు రథయాత్రకు సహాయ సహకారాలు అందిస్తున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

# 'స్థానిక' యుద్ధానికి సిద్ధం కండి

## ఎన్నికల కమిషనర్ ఎస్.రమేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్, నెల్లూరు కలక్టరేట్‌లో నుండి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు

స్థానిక ఎన్నికలకు సంబంధించి జడ్పీటిసి, ఎంపిటిసిలకు ఈనెల 17న నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామని, అదేవిధంగా పంచాయతీలకు ఫిబ్రవరి మొదటివారంలో నోటిఫికేషన్లు విడుదలవుతాయని, ఎన్నికలను రెండు విడతలుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎస్.రమేష్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈనెల 10న ఆయన విజయవాడ నుంచి కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లపై మాట్లాడారు. ముందుగా జడ్పీటిసి, ఎంపిటీసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని శాఖల అధికారులను సంసిద్ధం చేయాలని, ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా ముద్రణ పూర్తిచేశామని, మొత్తం 46 మండలాలకు గాను తొలిదశలో 21 మండలాలు, రెండో దశలో 25 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారిగా నుడా వైస్‌ఛైర్మెన్ బాలిరెడ్డిని నియమించామని, శాంతిభద్రతలకు సంబంధించి పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళికలు రూపొందిస్తోందని ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్, జడ్పీ సిఇఓ సుశీల, డిపిఓ ధనలక్ష్మి, ఎస్‌బీ డిఎస్పీ కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• జిల్లాలో

# పాఠశాలల నిర్వహణకు నిధులు

నెల్లూరు జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నిర్వహణకు ఈ విద్యాసంవత్సరానికి రూ.7.19కోట్లు కలెక్టర్ ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు ఎస్ఎస్ఏ అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 2528, ప్రాథమికోన్నత పాఠశాలలు 599 కలిపి మొత్తం 3,127 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మౌలిక వసతులు, పాఠశాలకు కావల్సిన వస్తువులు, మరుగుదొడ్ల నిర్వహణ, జాతీయ పండుగలు, మంచినీరు తదితర నిర్వహణకు ఈ నిధులను వినియోగించనున్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి ఈ నిధులను ఒక్కో పాఠశాలకు చెందిన హెచ్ ఎం ఖాతాల్లో జమ చేస్తామని బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ప్రైమరీ పాఠశాలలో 15 మంది విద్యార్థులు లోపు ఉంటే రూ.12.500, 15 నుంచి 100 మంది లోపు ఉంటే రూ.25 వేలు, 100 నుంచి 250 మంది లోపు ఉంటే రూ.50వేలు, 250 నుంచి 400 మంది లోపు ఉంటే రూ.75వేలు, 400 నుంచి ఆపైన ఎంతమంది ఉన్నా లక్ష రూపాయలు చొప్పున ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా 1065 పాఠశాలల్లో పనులకు సంబంధించి 850 పనులకు అంచనాలు పూర్తయ్యాయన్నారు. ఈ పనులకు రూ.82 కోట్ల నిధులు విడుదల చేస్తామని ఇప్పటికే 555 పాఠశాలల్లో పనులు ప్రారంభించామని, ఈ పనులకు సంబంధించి 740 పాఠశాలలకు అకౌంట్లు తెరిచామన్నారు.

# అలరించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న పొణకా దేవసేన తదితరులు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణంలోని వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అంద జేశారు. మునిసిపల్ మాజీ అధ్యక్షురాలు పొణకా దేవసేన, సబ్‌కలెక్టర్ సతీమణి మయూరి పాల్గొని మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళలకు సమాజంలో మరింత గౌరవం, విలువ ఉంటాయన్నారు. చదువులకే పరిమితం కాకుండా విద్యార్థులు చిన్నతనం నుంచే మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల విద్యార్థినులకు, వారి తల్లులకు గత పదేళ్ళ నుండి ఇదే విధంగా సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని పాఠశాల కరెస్పాండెంట్ కె.చంద్రమోహన్ తెలిపారు. న్యాయనిర్ణేతగా సునీత సేవా సంస్థ కార్యదర్శి సారంగం సులక్ష్మి వ్యవహరించారు. పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణ, కో–డైరెక్టర్‌లు సునీత, స్నేహలత, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# నారదుడిని మెచ్చుకున్న విష్ణుమూర్తి

అది అలవైకుంఠపురంలోని విష్ణు నివాసం... శేషపాన్పుపై మహావిష్ణువు పవళించి ఆపిల్ సెల్‌ఫోన్‌లో బ్రహ్మ, పరమేశ్వరుడులతో కాన్ఫరెన్స్ కలిపి మాట్లాడుతున్నాడు. లక్ష్మీదేవి మాత్రం ఆయన పాదాలు వత్తుతూ ఎదురుగా ఏర్పాటు చేసుకున్న ఎల్ఇడి టీవీలో వస్తున్న 'ఇనుప మేకులు, ఇత్తడి ఆకులు', 'పంతం పట్టిన పెళ్లాం... అంతమైన మొగుడు', 'కొడితే మొగుడినే కొట్టాలి'... వంటి సీరియల్స్‌ను వరుసగా చూస్తోంది. అంతలో అక్కడ "నారాయణ నారాయణ" అనే మాటలు వినిపించాయి. లక్ష్మీదేవి అటువైపు చూసింది. దేవలోకం మీడియా ప్రతినిధి, గాడ్స్ న్యూస్ నెట్‌వర్క్ ఛానెల్ అధినేత నారద మహర్షి అక్కడకు వచ్చాడు. విష్ణుమూర్తి కాళ్లు ఒత్తుతున్న లక్ష్మీదేవితో... మీరింకా మారలేదా? ఎన్ని సీరియల్స్ చూస్తున్నా, ఎన్ని సినిమాలు చూస్తున్నా, మీ కోసం ఎన్ని చట్టాలు తెస్తున్నా మీలో మార్పురాదా... జీవితాంతం ఈ మగాళ్ల కాళ్ల దగ్గర పడి వుండాల్సిందేనా? ఈ దాస్య శృంఖలాల నుండి మీకు విముక్తి లేదా అని ఆమెను రెచ్చగొట్టాడు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న విష్ణుమూర్తికి ఇవేవీ వినిపించలేదు. ఆయన ఫోన్ మాటల్లో ఆయనున్నాడు. నారదుడు అగ్గి రాజేశాడు... లక్ష్మీదేవిలో ఉక్రోషం ముంచుకొచ్చి తన వడిలో వున్న విష్ణుమూర్తి పాదాలను విసురుగా తోసింది. ఆ దెబ్బకు విష్ణుమూర్తి ఈ లోకంలోకి వచ్చి ఫోన్ కట్‌చేసి... ఏమైంది దేవీ... అని అడిగాడు. అక్కడే వున్న నారదుడిని చూసి... ఓహో మీరొచ్చారా స్వామి... ఏమయ్యేదేముంది, ఏదో ఒకటి మంట పెట్టేవుంటారు కదా, ఇంతకీ ఏ విషయంలో మంట పెట్టారో చెప్పండి అని అడిగాడు. అందుకు నారదుడు... ఏం లేదు దేవా.. స్త్రీ స్వేచ్ఛ గురించి కొంచెం ఎక్కువుగా చెప్పాను. భూలోకంలో ఎన్నికలలో సగం సీట్లు మహిళలకే ఇస్తున్నారు, ఇక్కడ మాత్రం మహిళల పట్ల వివక్ష కొనసాగుతోంది... అమ్మవారికి ఆ విషయమే గుర్తు చేశాను అని చెప్పాడు. అప్పుడు లక్ష్మీదేవి టక్కున.. స్వామి భూలోకం అంటే గుర్తుకొచ్చింది, అక్కడ ఇప్పుడు సంక్రాంతి పండుగ, భూలోక వాసులు భోగి, సంక్రాంతి పండుగలను ఎలా జరుపుకుంటున్నారో ఒకసారి చూసొద్దామా అని అడిగింది. మన కామధేను వైరల్ ఫీవర్‌తో బాధ పడుతోంది, వెహికల్ లేదు, ఇంకోసారి పోదాంలే అని విష్ణుమూర్తి చెప్పాడు. మీరు పోవాలనుకుంటే అన్నీ బావుంటాయి, అమ్మగారిని తీసుకుపోవాలంటేనే కామధేనుకు వైరల్ ఫీవర్ వచ్చుంటుందని నారదుడు మళ్ళీ అగ్గిపుల్ల వేశాడు. వెంటనే లక్ష్మీదేవి అలిగి బుంగమూతి పెట్టింది. విష్ణుమూర్తి తలపట్టుకుని... ఇక తప్పుతుందా... స్టాండ్‌బై కామధేనును తెప్పిస్తాను, ముగ్గురం కూడా భూలోకానికి పోదాం పదండి అని చెప్పాడు. అరగంటలో స్టాండ్‌బై కామధేను రావడం, దానినెక్కి ముగ్గురూ భూలోక యాత్రకు బయలుదేరడం జరిగింది.

వాళ్ళు అలా వస్తుండగా ఓ చోట భూమిపై పెద్దఎత్తున వారికి మంటలు కనిపించాయి. లక్ష్మీదేవి వాటిని చూసి... చూడండి స్వామి, ఈ దేశ వాసులెవరో గాని ఆకాశమంత ఎత్తున భోగి మంటలు వేసి పండుగ భలే చేసుకుంటున్నారని సంబరపడింది. దానికి నారదుడు... తల్లీ అవి భోగి మంటలు కాదు, అది భారత దేశం కాదు... ఇరాక్ ప్రాంతం... అమెరికా, ఇరాన్ దేశాలు ఒకరి మీద ఒకరు క్షిపణిదాడులు చేసుకోవడం వల్ల ఏర్పడ్డ మంటలు అని చెప్పాడు. తర్వాత కామధేను పశ్చిమ బెంగాల్ మీదుగా పోతుండగా, కలకత్తా నగరంలో పెద్ద ఎత్తున మంటలు కనిపించసాగాయి. కామధేనువును క్రిందకు దించమని లక్ష్మీదేవి అడిగింది. విష్ణుమూర్తి దించాడు. అక్కడ మంటల్లో బస్సులు, లారీలు, రైళ్లు కూడా తగలబడుతున్నాయి. లక్ష్మీదేవి ఆశ్చర్యంగా నోరెళ్లబెట్టి... ఇక్కడి ప్రజలేంటి ఇంత గొప్పగా భోగి మంటలేస్తున్నారు, రైళ్లు, బస్సులను కూడా భోగి మంటల్లో వేశారు... ఇలాంటి భోగి మంటలను నేనెక్కడా చూడలేదు అంది. అవి భోగి మంటలు కాదు తల్లీ... కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సిఏఏ, ఎన్ఆర్‌సి బిల్లులకు వ్యతిరేకంగా ఇక్కడి ప్రజలు తమ ఆస్తులను తామే తగలబెట్టుకుంటున్నారు. ఇవి ఆనందంతో వేస్తున్న మంటలు కావు, ఆందోళనతో వేస్తున్న మంటలు... దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఇప్పుడు మనకు ఇవే మంటలు కనిపిస్తాయి. మనం స్వచ్ఛమైన సంక్రాంతి భోగి మంటలు చూడాలంటే... హైటెక్ రత్న చంద్రబాబునాయుడు తన శ్రమతో ప్రపంచంలోనే అందమైన నగరంగా నిర్మించిన అమరావతికి పోవాలి... అని నారదుడు చెప్పాడు. విష్ణుమూర్తి వుండి.... అది ప్రపంచంలోనే అందమైన నగరం అని ఎలా చెప్పగలవని ప్రశ్నించాడు. ఐదేళ్ల నుండి ఆయన ఇచ్చిన ప్రకటనలను ఇంటర్నెట్ ఎడిషన్‌లలో చదివాను... ఆయన మాటలను బట్టి ఈపాటికి అది వరల్డ్ బెస్ట్ సిటీ అయ్యుండాలి, ఆ నగరం అందాలను చూడడానికి మనకు రెండు కళ్లు చాలవు... ఆ నగర అందాలకు ముగ్ధురాలై లక్ష్మీ అమ్మగారు అక్కడే స్థిరంగా వుండిపోదామని మీతో చెప్పినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదన్నాడు. అంత అందమైన నగరాన్ని ఖచ్చితంగా చూసి తీరాల్సిందే అని లక్ష్మీదేవి కూడా అడగడంతో కామధేనువును అమరావతిలో దించాడు విష్ణుమూర్తి. ముగ్గురూ దిగారు. వాళ్లకు అక్కడ బీడు పొలాలు తప్ప నగరం లాంటిదేమీ కనిపించలేదు. ఒకచోట కేకలు వినపడుతుండేసరికి అటువైపుగా వెళ్లారు. అది మందడం గ్రామం... "మూడు రాజధానులు వద్దు.. అమరావతి ముద్దు" అంటూ ప్లేకార్డులు పట్టుకుని అక్కడ కొంతమంది ధర్నా చేస్తున్నారు. కొందరు మీడియా ప్రతినిధులు కూడా అక్కడ వున్నారు. అప్పుడే చంద్రజ్యోతి ప్రతినిధి కాంతి పూజేశ్వరరావు ఆ ధర్నాను లైవ్ ఇస్తున్నాడు... స్టూడియోలో గ్యాస్‌రీడర్ పిచ్చి పెదలింగయ్య మాట్లాడుతూ... కాంతి పూజేశ్వర్... అక్కడ పరిస్థితి ఎలావుంది, ఉద్రిక్తంగా వుందా? అని ప్రశ్నించాడు. దానికి కాంతి పూజేశ్వర్... ఇక్కడ పరిస్థితి చాలా ఆందోళనకరంగా వుంది సార్... రాజధాని కోసం ఇక్కడి రైతులు దేనికైనా తెగబడేటట్లున్నారు, దేనినైనా తగలబెట్టేటట్లున్నారు. ఈ రోడ్డునపోయే మంత్రులను, ఎమ్మెల్యేలను కొట్టేటట్లున్నారు అని చెప్పాడు. నిజంగా అంత పని చేస్తారంటావా అని పెద లింగయ్య ప్రశ్నించాడు. దానికి కాంతి పూజేశ్వర్... వీళ్లు కడుపుకు ఉప్పు, కారమే తింటున్నారనుకుంటా... సిగ్గు, రోషం, పౌరుషం, చీము, నెత్తురు ఉన్న ట్లయితే ఇదిగో ఇప్పుడే వస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కారుపై దాడి చేస్తారు... అవేమీ లేకుంటే మూసుకుని కూర్చుంటారు... అని రెచ్చగొట్టాడు. అంతే, అక్కడున్న వాళ్లు రాళ్లు, కర్రలు తీసుకుని అప్పుడే అటుగా వచ్చిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కారుపై దాడికి దిగారు. పోలీసులు రంగంలోకి దిగి ఆ దాడి నుండి కాపాడి ఎమ్మెల్యేను పంపించారు. మళ్ళీ స్థానికులు కూర్చుని శాంతియుతంగా ధర్నా చేయసాగారు. చంద్రజ్యోతి ఛానెల్ మాత్రం ఆ దృశ్యాలను లైవ్‌లో చూపించింది. తర్వాత స్టూడియో నుండి పెదలింగయ్య... కాంతి పూజేశ్వర్, వీళ్ళు ఇంత శాంతియుతంగా ధర్నా చేస్తుంటే, రాజధాని విషయంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం దిగొస్తుందంటావా... అవతల రాష్ట్రాలలో ఎన్ఆర్‌సి బిల్లుకు వ్యతిరేకంగా రైళ్లనే తగులబెడుతుంటే, ఇక్కడ కనీసం బస్సులనైనా తగలబెట్టకపోతే ప్రభుత్వంలో కదలిక వస్తుందా? వీరి ఆందోళన ఇంత చప్పగా వుంటే ఏ ప్రభుత్వం మాత్రం స్పందిస్తుంది అని నిట్టూర్చాడు. కాంతి పూజేశ్వర్ దానికి సమాధానమిస్తూ... సార్, వీళ్లు తూతూ మంత్రంగా ధర్నా చేస్తున్నారు, వీళ్ళవి ఉద్యమాలు చేసే మొహాలేనా... టీవీలో పడతామని చెప్పి ముఖాలకు పౌడర్ కొట్టుకుని వచ్చారు. వీళ్లకు బస్సులను తగలబెట్టే దమ్మూ, ధైర్యం ఎక్కడుంది. ఆ జగన్ దెబ్బకు వీళ్ల తారెత్తిపోతున్నారు అని రెచ్చగొట్టేటట్లు మాట్లాడాడు. అంతే ఆవేశంతో రెచ్చిపోయిన వాళ్ళు అప్పుడే అటుగా వచ్చిన మూడు పల్లెవెలుగు బస్సులకు నిప్పు పెట్టారు... మన ప్లాన్ వర్కవుట్ అయ్యిందంటూ పిచ్చి పెదలింగయ్య, కాంతి పూజేశ్వర్‌లు ఒకరికొకరు బొటనవేళ్లు చూపించుకున్నారు. అప్పటిదాకా జరిగినదాన్ని ప్రత్యక్షంగా చూసిన విష్ణుమూర్తి, నారదుడితో... నారదా! నీ గొప్పతనం నాకిప్పుడే తెలిసింది, నేనింత వరకు నిన్ను మాత్రమే అగ్నిపుల్ల స్వామి అని తిట్టుకుంటున్నాను, ఇక్కడి నారదులతో పోలిస్తే నీ టాలెంట్ ఎంత? మనం భోగి మంటలు చూద్దామని వచ్చాం కాని... ఆక్రోశపు మంటలను కాదు... ఈ మంటలు మనకొద్దు... మన లోకానికే పోదాం పదండి అంటూ వారితో తిరిగి వైకుంఠానికి బయలుదేరాడు.

# శ్రీసిటీలో అంతర్జాతీయస్థాయి మౌలికవసతులు

## - కొనియాడిన సింగపూర్ కాన్సుల్ జనరల్



పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు శ్రీసిటీలో అంతర్జాతీయ స్థాయిలో ఉండడం ఎంతైనా సంతోషకరమని సింగపూర్ కాన్సుల్ జనరల్ పాంగ్ కాక్ టియాన్ కొనియాడారు. ఈనెల 13న ఆయన వైస్ కాన్సుల్ జనరల్ ఇవాన్ టాన్‌తో కలసి శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ అధికారి ఎస్‌పి శర్మ వారికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ అభివృద్ధి తదితర విషయాల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ సింగపూర్ కాన్సుల్ జనరల్ శ్రీసిటీ సందర్శనకు రావడం తమకెంతో గౌరవప్రదమైన విషయమని అన్నారు. దేశంలోకి పెద్దస్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వనరుగా సింగపూర్ అవతరిస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నదని అంటూ, ఇరుదేశాల మధ్య వ్యాపార సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. వారి పర్యటనద్వారా సింగపూర్ వ్యాపార పెట్టుబడులు శ్రీసిటీకి వచ్చేందుకు మార్గం సులభతరమవుతుందన్నారు.

# రెయిన్‌బో గేమ్స్ గాలా



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ భాస్కర్‌భూషణ్

నెల్లూరు రూరల్ మండలం లోని కలివెలపాళెంలోని రెయిన్‌బో సిబిఎస్ఇ పాఠశాలలో ఇటీవల గేమ్స్ గాలా–2019 పోటీలు జరిగాయి. 'ఫిట్ ఇండియా–ఫిట్ రెయిన్‌బో' అనే ఇతివృత్తంతో రూపొందించిన ఈ కార్యక్రమం ఎంతో కన్నులపండువగా, కోలాహలంగా జరిగింది. ఈ వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించాలని, అదేవిధంగా చదువులోనూ ఉత్తమ ఫలితాలు తెచ్చుకోవాలని అన్నారు. తొలుత 'ఫిట్ ఇండియా–ఫిట్ రెయిన్‌బో' మస్కట్‌ను గాలిలోకి వదిలి గేమ్స్‌గాలాను ప్రారంభించారు. మిక్కీమౌస్ డ్యాన్స్ జుంబా డ్యాన్స్, ఫిట్ ఇండియా డ్యాన్స్, యోగా, పిరమిడ్స్, కర్రాల్ డ్రిల్, బ్యాంబూ డ్రిల్ తదితర కార్యక్రమాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మా సుబ్రహ్మణ్యం, వైస్‌ప్రిన్సిపల్ సురేఖారెడ్డి, శ్రీమతి ఫాతిమాఖాన్ తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆద్యంతం ఎంతో వేడుకగా జరిగింది.

# పద్యం..తెలుగువారి సొంతం

## పద్య సారస్వత పరిషత్ వార్షికోత్సవంలో వక్తలు



తెలుగుపద్యం తెలుగువారి సొంతమని, ప్రపంచంలోనే ఎంతో గొప్పదైన తెలుగు భాషను మనం పరిరక్షించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. తెలుగుభాష అభ్యున్నతికి పద్య సారస్వత పరిషత్ చేస్తున్న సేవ అమూల్యమైనదని కొనియాడారు. ఈనెల 12న నెల్లూరు బాలాజీనగర్‌లోని ఎలమందయ్య స్కూల్ (వివేకానంద పాఠశాల)లో పద్య సారస్వత పరిషత్ ద్వితీయ వార్షికోత్సవం ఎంతో ఘనంగా జరిగింది. పరిషత్ అధ్యక్షుడు పోలవరపు లక్ష్మీనరసింహారావు సభకు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి చీమకుర్తి వేంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, నలుబోలు బలరామయ్య నాయుడు, మెట్టు రామచంద్రప్రసాద్, యలమందయ్య, ఏ.జయప్రకాశ్, సుభద్రాదేవి తదితరులు పాల్గొని తెలుగుభాష ఔన్నత్యాన్ని వివరించారు. అనంతరం 'విపంచిక' సంచికను ఆవిష్కరించారు. శతావధాని సూరం శ్రీనివాసులు విపంచికలోని పద్యకవితలు, వ్యాసాలను చక్కగా సమీక్షించారు. ప్రముఖ అవధాని కోట రాజశేఖర్, సాహితీవేత్త పింగళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పద్యపఠనంలో విజేతలైన విద్యార్థులకు మురారిశెట్టి తిరుపతిస్వామి బహుమతులను ప్రదానం చేశారు.

# 'నవరత్నాల' వెలుగుల్లో సంక్రాంతి సందడి



కళాకారులకు జ్ఞాపికలను అందజేస్తున్న జేసీ-2 కమలకుమారి

ఈ ఏడాది సంక్రాంతి పండుగ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల వెలుగుల్లో మరింత ప్రకాశించింది. నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 13న సంక్రాంతి సంబరాలు ఎంతో కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్–2 కమలకుమారి సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు నింపుతోందని కొనియాడారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 1.89 లక్షల మంది రైతులకు 159.79 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని, అదేవిధంగా జగనన్న విద్యాదీవెన పథకం కింద68,313 మంది విద్యార్థులకు ఉపకారవేతనలు, ఫీజుల కింద 121.54 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 8.79 లక్షల మందిని అర్హులుగా గుర్తించడం జరిగిందని, పేదలందరికీ గృహవసతి కలుగజేసేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా 156 కోట్ల రూపాయల అంచనాలతో 1106 పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఉపాధిహామీ కింద 242.40 కోట్లతో 651 గ్రామ సచివాలయ భవనాలను నిర్మిస్తారని, వైఎస్సార్ పింఛన్ పథకం కింద 3,08,185 మందిని లబ్ధిదారులుగా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. డిఆర్‌డిఏ పి.డి శీనానాయక్, ఆర్డీఓ హుస్సేన్‌బాషా, సిపిఓ సుశీల, డిఇఓ జగన్నాధాచార్యులు, డిపిఓ ధనలక్ష్మి, ఎస్ఎస్ఏపిఓ బ్రహ్మానందరెడ్డి, మెప్మా పి.డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకలలో భాగంగా అధికారులకు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆనంద కోలాహలం మధ్య వేడుకగా జరిగాయి. ఐసిడిఎస్, డిఆర్‌డిఏ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు, గొబ్బి పాటలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రకాల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కళాక్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది. జేసీ–2 కమలకుమారి చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. జాదుగర్ శ్రీనివాస్ నిర్వహించిన మ్యాజిక్‌షో అందరినీ ఆకట్టుకుంది.

## శ్రీరంగనాధునికి అధ్యయనోత్సవాలు

నెల్లూరు రంగనాయకులపేటలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఎంతో వైభవంగా స్వామివారికి అధ్యయనోత్సవాలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఈనెల 13న రాపత్తు ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆండాళమ్మ వారిని నగరంలోని నవాబుపేటలో ఉన్న బుజ్జమ్మతోటలో వేంచేపు చేసి పూజలు చేశారు. ఆ రాత్రి దేవేరులతో విచ్చేసిన శ్రీ రంగనాథస్వామివారిని శోభాయమానంగా అలంకరించి ఉత్తరద్వారంలో భక్తులకు దర్శన ఏర్పాటుచేశారు.

ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి జగన్నాధాచార్యులు, నిశింద సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివార్లకు, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర హారతులు సమర్పించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## మార్చి 4 నుంచి..

## కొండ బిట్రగుంటలో బ్రహ్మోత్సవాలు

బోగోలు మండలంలోని కొండ బిట్రగుంటలో ఉన్న బిలకూట క్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 14 నుంచి పెద్దఎత్తున బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు భారీసంఖ్యలో జనం తరలివస్తారు కనుక, ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కావలి సబ్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో, ఆలయ కార్యనిర్వాహణాధికారి మల్లికార్జున రెడ్డి ఇతర శాఖల అధికారులందరూ కలిసి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# మల్లేశ్వరస్వామి ఆలయం ఛైర్మన్‌గా శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయం నూతన పాలకమండలి ఈనెల 13న ప్రమాణస్వీకారం చేసింది. ఆలయం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛైర్మన్‌గా వి.శ్రీనివాసులురెడ్డితో పాటు నూతనంగా నియమితులైన సభ్యులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, లీలారాణి, జ్యోతిప్రియ, సంధ్య ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ చైతన్య, ఆలయ కార్యనిర్వహణాధికారి నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

# అమరావతిలోనే రాజధాని

అమరావతిలోనే రాజధాని ఉండాలని, అన్ని జిల్లాల్లో అభివృద్ధి జరగాలన్నది తమ పార్టీ నిర్ణయమని బిజెపి నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు జి.భరత్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల 13న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో నెల్లూరు, తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గాలకు పార్టీ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన భరత్‌కుమార్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు కర్నూలులో ఉండాలని కూడా తమ పార్టీ నిర్ణయించిందన్నారు. బిజెపి రాష్ట్రంలో బాగా బలోపేతమవుతోందని, 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పనిచేసే ప్రతి కార్యకర్తకు బిజెపిలో మంచి గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం జిల్లా కమిటీలను ఏర్పాటుచేసి అభ్యర్థులను ఎంపికచేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డితో పాటు బిజెపి సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కరణం భాస్కర్, మండ్ల ఈశ్వరయ్య, వంశీధర్‌రెడ్డి, నరసింహులునాయుడు, బాలయ్యగౌడ్, కాయల మధు, ఉదయ్, ముక్కు రాధాకృష్ణ, పరశురామ్ తదితరులు పాల్గొని భరత్‌కుమార్, దయాకర్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు.

## కాలధర్మం

## తుమ్మల సుబ్బారెడ్డి



'నెల్లూరు ఎక్స్‌ప్రెస్' పత్రికా సంపాదకులు, నెల్లూరు ఏసి సెంటర్‌లోని నీలిమా టవర్స్ అధినేత తుమ్మల సుబ్బారెడ్డి ఈ నెల 16వ తేదీ స్వర్గస్థులైనారు. ఆయన వయసు 69సంవత్సరాలు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డికి అత్యంత సన్నిహితుడైన తుమ్మల సుబ్బారెడ్డి శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ట్రస్టుబోర్డులో సభ్యులుగా కూడా ఉన్నారు. ఒకప్పుడు నెల్లూరులో ఒక వెలుగు వెలిగిన నీలిమా బార్ అండ్ రెస్టారెంట్ అధినేత కూడా ఆయనే. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# స్వామి వివేకానందకు నివాళులు



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఈ నెల 12వ తేదీన స్వామి వివేకానంద 158వ జయంతి సందర్భంగా కోవూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మన జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు స్వామి వివేకానంద బోధనల ద్వారా పరిష్కారం దొరుకుతుందన్నాడు. ప్రపంచంలోని యువతను సన్మార్గం వైపు నడిపించే శక్తి స్వామి వివేకానంద బోధనలకే వుందన్నాడు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మారుబోయిన వెంకటేశ్వర్లు, వీరంశెట్టి మధుసూదన్‌రావు, ఇంటూరు విజయ్, గౌతంకుమార్, శివకుమార్, కన్నా మహేష్, శివ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఆలయ పాలకమండళ్ళకు నోటిఫికేషన్

నెల్లూరు జిల్లాలోని 8 ఆలయాలకు పాలకమండలి నియామకానికి నోటిఫికేషన్ ఈనెల 11న విడుదలయ్యింది. అందులో ప్రతి ఆలయం పాలకమండలిలో 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలకమండలిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50శాతం, మొత్తం పాలకమండలిలో మహిళలని 50శాతం నియమించాలని ఆదేశించింది. నెల్లూరు నగరంలోని సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం, ఉస్మాన్ సాహెబ్ పేట కోదండరామస్వామి దేవస్థానం, అన్నపూర్ణాసమేత కాశీ విశ్వేశ్వరాలయం ఉన్నాయి. గూడూరు పట్టణంలోని అలఘనాథస్వామి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, కొడవలూరు మండలంలోని గండవరం ఉదయకాళేశ్వరస్వామి, కోట మండలంలోని గూడలి భీమేశ్వరస్వామి, సంగం మండలం సంగమేశ్వరస్వామి, వింజమూరు మండలం నల్లగొండ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

# కనువిందుగా గోదాదేవి కల్యాణం

నెల్లూరు నగరంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఈనెల 14వ తేది రాత్రి గోదాదేవి కల్యాణోత్సవం కనువిందుగా జరిగింది. గోదాదేవి, శ్రీరంగనాధుని ఉత్సవ విగ్రహాలను అర్చకులు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేసి ఈ వేడుక నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కనమర్లపూడి సురేష్, మెంటా రమణయ్య, కోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెలలోనే విశాఖకు..

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నంను పరిపాలన రాజధానిగా ఎంపిక చేసుకున్నాడు. ఇప్పుడు ఒక పూర్తి పరిపాలన వ్యవస్థ ఒక చోట వుండడానికి, పరిపాలన సాగించడానికి రాష్ట్రంలో అవకాశమున్న పెద్ద నగరాలలో విశాఖపట్నం మొదటి స్థానంలో ఉండనుకోవచ్చు. అందుకే వేగవంతమైన అభివృద్ధి, సవ్యమైన పరిపాలన కోసం ఆయన విశాఖ వైపు మొగ్గు చూపడం జరిగింది.

రాజధానిగా ఇక విశాఖపట్నంను ఎంచుకున్నాక అక్కడ నుండి పరిపాలన సాగించడానికి వారాలు, వాజ్యాలు చూసుకోనవసరం లేదు. మొదట ఉగాది తర్వాత రాజధానిని అమరావతి నుండి విశాఖపట్నంకు తరలిస్తారనుకున్నారు. అయితే అప్పటిదాకా ఎందుకు ఆగాలన్న ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది. రాజధానిగా విశాఖపట్నం ఖరారైపోయింది. ఎవరెన్ని డ్రామాలు వేసినా ఆ నిర్ణయంలో ఇక మార్పుండదు. అలాంటప్పుడు రాజధాని మార్పు కోసం వేచి చూడడం దేనికి... ఫిబ్రవరిలోనే అమరావతి నుండి విశాఖపట్నంకు రాజధానిని తరలించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈమేరకు సచివాలయానికి, ఇతర శాఖలకు భవనాలను సిద్ధం చేసినట్లు సమాచారం. విశాఖకు రాజధానిని తరలిస్తారన్నది ప్రభుత్వానికి ముందుగానే తెలుసు కాబట్టి, సీఎం ప్రకటన చేయకముందే ఇక్కడ భవనాల అన్వేషణ జరిగిందని సమాచారం. అలాగే ఉద్యోగస్థుల అవసరాలకు తగ్గట్లుగా పెద్దఎత్తున అపార్ట్‌మెంట్లు, వసతి గృహ సముదాయాల నిర్మాణాలు కూడా జరిగి వున్నాయి. సచివాలయ ఉద్యోగులు అమరావతికి రావాలంటే బద్దకించారు. అక్కడ శాశ్వత నివాసం ఉండడానికి ఇష్టపడలేదు. ఇప్పటికీ వాళ్ళు హైదరాబాద్‌లోనే వుంటూ అమరావతికి వచ్చిపోతున్నారు. అదే విశాఖపట్నంలో రాజధాని అయితే సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు విశాఖలోనే స్థిరనివాసానికి మొగ్గు చూపే అవకాశముంది.

అంతేకాదు, మార్చి, ఏప్రిల్ నెలల్లో విద్యాసంవత్సరం మొదలవుతుంది. హైదరాబాద్ నుండి విశాఖకు తరలివచ్చే ఉద్యోగులకు తమ పిల్లల చదువులకు సంబంధించి ఒక క్లారిటీ వస్తుంది. అందుకే ఫిబ్రవరిలోనే రాజధానిని విశాఖకు మార్చేస్తే మార్చి, ఏప్రిల్ కల్లా పూర్తిస్థాయి పరిపాలనా రాజధానిగా విశాఖ అవతరించే అవకాశముంది. పూర్తిస్థాయిలో రాజధాని వుంటే, పరిపాలనలో వేగం పెరగటంతో పాటు అభివృద్ధి ప్రక్రియ కూడా వేగం పుంజుకుంటుంది.

# వెంకయ్య కృషి ఫలితం

(మొదటి పేజీ తరువాయి)

భారత ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయుడైన వెంకయ్యనాయుడు కృషి ఫలితంగా వెంకటాచలం మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఈ కేంద్రం ఈనెల 21న ప్రారంభం కాబోతోంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌రావు, కేంద్ర మానవవనరులశాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ తదితర ప్రముఖులు పాల్గొననున్నారు.

ఈనెల 20,21,22 తేదీల్లో భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు జిల్లాకు విచ్చేయనున్నారు. ప్రాథమిక షెడ్యూల్ ప్రకారం 20వ తేదీన ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి చేరుకుని ఉదయం 8.30 గంటలకు రైలులో బయలుదేరి 11గంటలకు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుంటారు. 21వ తేదీన ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 22న తిరిగి ఢిల్లీకి బయలుదేరి వెళ్తారని తెలుస్తోంది.

ఎంతో ప్రాచీనమైన మన తెలుగుభాష కొత్త వెలుగులు సంతరించుకోబోతోంది. ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ఆ శుభ తరుణం రానే వచ్చింది. మహాభారతాన్ని ఆంధ్రీకరించి తెలుగుభాషామతల్లికి సగర్వంగా సమర్పించిన కవిబ్రహ్మ తిక్కన పుట్టిన నెల్లూరుసీమలో తెలుగుభాషకు కొత్త వైభవం రానుంది. భారత ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయుడైన వెంకయ్యనాయుడు చూపిన చొరవ, చేసిన కృషి ఫలితంగా తెలుగుభాష అధ్యయన కేంద్రం వెంకటాచలం మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఈనెల 21న ప్రారంభం కాబోతోంది.

**తెలుగుజాతికే గర్వకారణం :**

నెల్లూరుసీమలో 'ప్రాచీన తెలుగు భాషా పీఠం' ఏర్పాటుకానుండడం తెలుగు జాతికే గర్వకారణం. దశాబ్దాలుగా కలగా మిగిలిన ఈ మహత్కార్యాన్ని సాధించేందుకు ఎంతో శ్రద్ధ తీసుకుని కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించిన ఘనత మన సింహపురి ముద్దుబిడ్డ, భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుగారిదే కావడం విశేషం. మైసూరులో ఉన్న ఈ ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని తెలుగుతల్లి ఒడికి చేర్చిన ఘనత మన వెంకయ్యనాయుడిదే. కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను ఏనాటికీ విస్మరించకూడదనే విషయాన్ని అక్షరాలా ఆచరించి చూపుతూ అందరికీ మార్గదర్శకంగా నిలిచిన వెంకయ్యనాయుడు, మాతృభాషా పరిరక్షణకు, తెలుగుభాష అభివృద్ధికి తీసుకున్న ఈ చొరవ అద్వితీయం. తెలుగుభాష అభ్యున్నతికి, వికాసానికి అత్యంత కీలకమైన తెలుగు భాషా కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన వెంకయ్యనాయుడుకు తెలుగువారంతా మనసారా కృతజ్ఞతలు చెప్తున్నారు. నెల్లూరుసీమలో ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం ఏర్పాటు పట్ల కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు, సారస్వతవేత్తలు, పరిశోధకులు అందరిలోనూ ఆనందం వ్యక్తమవుతోంది. ప్రాచీనకాలం నుంచి నేటి ఆధునిక కాలం దాకా ఎందరో మహనీయులు..కవులు, పండితులు నెల్లూరు సీమనుంచి రచనలు చేస్తూ తెలుగుభాషా మధురిమలను లోకానికి చాటుతూనే ఉన్నారు. తెలుగు భాష పట్ల తమకున్న మమకారాన్ని చాటుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరుసీమలో ప్రాచీన తెలుగుభాషా కేంద్రం ఏర్పాటుకానుండడం అందరికీ ఎంతో సంతోషం కలిగిస్తోంది. అమ్మభాష పట్ల మమకారం ఉన్నవారికి.. మాతృభాషాభివృద్ధిని కోరుకునేవారికి.. మొత్తంగా తెలుగు వెలుగుల నవోషస్సు కోసం ఎదురు చూస్తున్న కోట్లాదిమంది తెలుగుప్రజలందరికీ ఈ తెలుగు అధ్యయన కేంద్రం ఏర్పాటు ఎంతో సంతోషం కలిగిస్తోంది. ఈ అపూర్వమైన కార్యాన్ని సాధించడం ద్వారా అటు తెలుగుభాషకు, ఇటు పుట్టిన గడ్డకు విశేష ఖ్యాతిని తెచ్చిన మన వెంకయ్యనాయుడుకు నెల్లూరీయులతో పాటు..తెలుగు ప్రజలందరూ మనసారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# 'సుప్రీం' స్టే!

(మొదటి పేజీ తరువాయి)

విచారించిన సుప్రీం కోర్టు స్థానిక ఎన్నికలపై నాలుగు వారాల పాటు స్టే విధించింది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలను నిర్వహించే ప్రక్రియలో జడ్పీటీసీ, పంచాయితీలకు రిజర్వేషన్లు ఖరారు చేసి తుది నివేదికను హైకోర్టుకు సమర్పించింది. స్థానిక సంస్థల ఎన్నికలలోనూ రిజర్వేషన్లు 50శాతం కోటాను మించకూడదు. కాని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి బీసీలకు సీట్లలో పెద్దపీట వేసే క్రమంలో రిజర్వేషన్‌లను దాదాపు 60శాతానికి తీసుకెళ్లాడు. దీనిపై హైకోర్టులో కొందరు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు రిజర్వేషన్‌లు ఎందుకు పెంచాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ ఇవ్వాలని కోరిందేగాని ఎన్నికలపై స్టే ఇవ్వలేదు.

అంతేకాదు, నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని కూడా ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై పిటిషనర్లు సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు రిజర్వేషన్‌ల అంశాన్ని పరిష్కరించమని హైకోర్టును ఆదేశిస్తూ, ఎన్నికల ప్రక్రియపై నాలుగువారాలు స్టే విధించింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం పాత రిజర్వేషన్‌ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే మళ్లీ చాలా స్థానాలకు రిజర్వేషన్‌లు మార్చాల్సిరావచ్చు!

# పల్లెల్లో పండుగ సందడి

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేసింది. పిల్లలు చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థుల అభ్యున్నతి కోసం రూపొందించిన 'అమ్మ ఒడి' పథకం ఇప్పుడు అందరికీ చేరువలోకి రావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అయితే సరిగ్గా సంక్రాంతి పండక్కి ముందే అందరి ఖాతాల్లోకి డబ్బులు పడడంతో సంక్రాంతి సంబరాలు రెట్టింపయ్యాయి. గత ఐదేళ్లలో చంద్రబాబు సంక్రాంతి కానుకలని చెప్పి కిలో చక్కెర, గోధుమలు, వంద గ్రాముల నెయ్యి ఇచ్చి పండుగ చేసుకోమనేవాడు. ఇక్కడ ఇచ్చే సరుకుకంటే ఆయన పబ్లిసిటి బిల్డప్ ఎక్కువగా వుండేది.

ఈ సంవత్సరం ఏకంగా సంక్రాంతి పండుగకు ముందే ఒక్కో తల్లి ఖాతాలో 'అమ్మ ఒడి' క్రింద 15వేల రూపాయలు జమయ్యాయి. ఇంకేముంది... పల్లెటూర్లలో సంక్రాంతి సంబరాలు ఆకాశాన్నంటాయి. పండక్కి ముందే బ్యాంకుల నుండి ఈ నగదును డ్రా చేసుకుని ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసారి బట్టల షాపులు, ప్రొవిజన్ షాపులు కిటకిటలాడాయి. వైన్ షాపులు, మాంసం కొట్ల వద్ద అయితే జాతరే. గ్రామాలలో సినిమాహాళ్ళ వద్ద అయితే తొక్కిసలాటే! 1992 తర్వాత కాలంలో పల్లెటూర్లలో సంక్రాంతి సందడి బాగా తగ్గింది. పంటలు చేతికి అందకపోవడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి వాటి మూలంగా పండగ కళ తప్పింది. ఈ ఏడాది మాత్రం 'అమ్మ ఒడి' పుణ్యమా అని సంక్రాంతి సందడి బాగా కనిపించింది. 'అమ్మ ఒడి' నగదు పిల్లల చదువులకేమోగాని పెద్దోళ్ల పండుగ బాగా జరుపుకోవడానికి ఉపయోగపడింది.

**చదువుకు భరోసా**

అమ్మ ఒడి పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలల్లో కూడా తమ పిల్లలను చదివించుకోవచ్చన్న భరోసా తల్లిదండ్రులకు కలుగుతోంది. ఇందులో భాగంగా జిల్లాకు 330.91 కోట్ల రూపాయలను కేటాయించింది. పేద, మధ్యతరగతి పిల్లలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకోవాలనే సత్సంకల్పంతో ప్రభుత్వం రూపొందించిన 'అమ్మ ఒడి' పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఎంతోమంది తల్లులు, తల్లిదండ్రులు తమ బిడ్డల చదువులకు ఎంతగానో ఉపయోగపడనున్న ఈ పథకం తమకు ఒక వరం వంటిదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి 15 వేలు**

ఈ పథకం కింద తల్లుల బ్యాంక్ ఖాతాల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా 15వేల రూపాయలు జమ చేయడం జరిగింది. జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి ఇంటర్ దాకా చదువుకునే విద్యార్థులు 4,52,896 మంది ఉండగా, వీరిలో 3,20,766 మంది 'అమ్మ ఒడి' పథకానికి అర్హులుగా నిర్ధారించినప్పటికీ, వీరిలో ఇద్దరు పిల్లలు కలిగి ఉండడం, ప్రభుత్వోద్యోగి అయివుండడం, ఇన్‌కాంటాక్స్ చెల్లిస్తున్న వారు కావడం తదితర కారణాలతో వీరిలో తొలివిడతగా 2,20,607 మంది విద్యార్థులను అర్హులుగా నిర్ధారించారు. మిగిలిన విద్యార్థుల విషయాన్ని పెండింగ్‌లో ఉంచారు. ఈ పథకానికి సంబంధించి తొలివిడతగా 330.91 కోట్ల రూపాయలు నిధులను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రారంభించిన కొద్ది గంటల్లోనే జిల్లాలో తొలివిడతగా నిర్ధారించిన విద్యార్థుల తల్లుల తాలూకు బ్యాంకు ఖాతాల్లో 15వేల వంతున నగదు జమ కావడం విశేషం.

# ఇక నుండి... కమల'సేన'

## • నాడు 'అన్నయ్య'... నేడు 'తమ్ముడు'



గురువారం పొత్తుపై బీజేపీ నాయకులతో చర్చిస్తున్న పవన్‌కళ్యాణ్

***అంతర్జాతీయ వ్యాపార రంగంలో ఇప్పుడొక ట్రెండ్ నడుస్తోంది. ఒక వ్యక్తి ఒక కంపెనీని ప్రారంభిస్తాడు. దానికి చాలా తక్కువ పెట్టుబడి అవుతుంది, దాని లోగో, కంపెనీ పేరు అంతా వినూత్నంగా వుంటుంది. కొద్దికాలానికి ఆ కంపెనీకి బ్రాండ్ ఇమేజ్ వస్తుంది, అప్పుడు వందలు, వేలకోట్లకు ఆ కంపెనీని అమ్మేస్తుంటారు.***

ఇప్పుడు రాజకీయాలలోనూ ఇదే ట్రెండ్ నడుస్తోంది. ఇమేజ్ కలిగిన వ్యక్తులు రాజకీయ పార్టీలను పెడతారు, జెండా, గుర్తు రూపొందించుకుంటారు, సొంత ఇమేజ్ వల్ల ఒక కేడర్ ఏర్పడుతుంది, ఒకట్రెండు ఎలక్షన్‌లలో ఆ ఇమేజ్‌ను సొమ్ము చేసుకుంటారు. ఇక ఇమేజ్ తగ్గిపోయి పార్టీ బ్రాండ్ విలువ పడిపోతుందనుకున్నప్పుడు తమ పార్టీని జాతీయ పార్టీలో విలీనం చేయడమో, లేక పెద్ద పార్టీతో పొత్తు పెట్టుకోవడమో చేస్తుంటారు. ఇప్పుడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా అదే చేశాడు?

తన సోదరుడు మెగాస్టార్ చిరంజీవి బాటలోనే తమ్ముడు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ పయనించాడు. 2009లో ప్రజారాజ్యం పార్టీని పెట్టిన చిరంజీవి ఆ ఎన్నికల్లో 18 అసెంబ్లీ సీట్లకు పరిమితం కావడం, ఆ తర్వాత ఎక్కువ కాలం పార్టీని నడపలేక కాంగ్రెస్‌లో విలీనం చేయడం, దానికి ప్రతిఫలంగా రాజ్యసభ, కేంద్రమంత్రి పదవిని పొందడం తెలిసిందే!

ఇప్పుడు పవన్‌కళ్యాణ్ కూడా బీజేపీతో బేరం కుదుర్చుకున్నాడు. స్థానిక ఎన్నికలకల్లా బీజేపీ - జనసేనల మధ్య పొత్తు కుదిరింది. ఈ నెల 16వ తేదీన బీజేపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ, పురంధరేశ్వరి, సోము వీర్రాజు, సునీల్ దియోధార్ తదితరులతో జనసేన నేతలు పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌లు సుదీర్ఘ చర్చలు జరిపారు. వచ్చే స్థానిక ఎన్నికల నుండే కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. పవన్ తమ గూటికి చేరడంతో బీజేపీ నాయకులు 2024లో రాష్ట్రంలో అధికారమే లక్ష్యమని చెబుతున్నారు. ఈమధ్య ఢిల్లీ వెళ్లి బీజేపీ ఆఫీసు ముందు పవన్‌కళ్యాణ్ పడిగాపులు కాసింది ఇందుకేనని, ఆయన వాళ్లను ఒక రాజ్యసభ పదవి అడిగాడని విశ్వసనీయ సమాచారం. మరి ఆ మేరకు వాళ్ళు ఒప్పుకున్నారేమో ఇక్కడ పొత్తుకుదిరింది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు








Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com